ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 22 అక్టోబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## ట్రంప్‌నకు ఎదురుదెబ్బ! భారత ఎజెండాకు యూరోపియన్ కౌన్సిల్ ఆమోదం

భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని స్థాపించే దిశగా పనిచే యాలనే ఉద్దేశ్యాన్ని కౌన్సిల్ గుర్తించింది. ఇది సముచిత మైతే, రక్షణ పారిశ్రామిక సహకారానికి కూడా దారితీ స్తుందని యూరోపియన్ కౌన్సిల్ ప్రకటన పేర్కొంది. ఉక్రెయిన్‌పై రష్యా దూకుడుగా చేస్తున్న యుద్ధం అన్ని అంశాలపై ఇయు భారతదేశంతో సంభాషణను కొనసాగిస్తుందని పేర్కొంది. యూరోపియన్ కమిషన్ గతంలో ప్రకటించిన కొత్త వ్యూహాత్మక ఇయు భారత్ ఎజెండా తీర్మానాలను సోమవారం (అక్టోబర్ 20, 2025) యూరోపియన్ కౌన్సిల్ ఆమోదించింది.



## రైతులకు రబీ షాక్

- చైనా ఎగుమతుల నిలిపివేతతో పెరగనున్న ఎరువుల ధరలు
- యూరియా, డీఏపీ ఎరువుల్లో 95 శాతం చైనా నుంచే..
- ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం

5



## కిక్కు దించుతున్న లిక్కర్ రేట్లు!

- మహారాష్ట్రలో భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు
- ధరల పెంపుతో తగ్గిన రెవెన్యూ
- జీవన వ్యయం పెరగడమూ కారణమే
- కొవిడ్-19 కాలంలో విదేశీ మద్యం అమ్మకాలు పుంజుకోవడం విశేషం.

# మావోలు లొంగిపోవాలి

- జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- రాష్ట్రంలో తీవ్రవాదులు, ఉగ్రవాదులు, మతతత్వ నేరాలు పెరగకుండా పోలీసుల కృషి భేష్
- నిబద్ధతతో పనిచేసే అధికారులను ప్రభుత్వం గుర్తిస్తుంది... అమరుల కుటుంబాలకు అండగా ఉంటుందన్న సీఎం
- పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరు
- కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



హైదరాబాద్

మావోయిస్టు ఉద్యమంలోని అజ్ఞాత నాయకులు జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం అందరికీ తెలుసునని, మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతతో పని చేసే అధికారుల కృషిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని అన్నారు. మంగళవారం గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి. పోలీసుల కృషితో ఇప్పుడవి దాదాపు లేకుండా పోయాయి. గ్రేహౌండ్స్ కమాండోలు సందీప్, శ్రీధర్, పవన్ కల్యాణ్‌లు సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందితే.. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్‌లాల్, నల్లగొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారు. మూడురోజుల కిందట నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం పొందారు. అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, ప్రమోద్ లాస్ట్ డ్రాన్ శాలరీ అతని పదవీ విరమణ సమయం వరకు కుటుంబసభ్యులకు ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నాం. వీటితో పాటు - మిగతా 2లో

## బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్లు రెడీ

- పార్టీ అధినేత కేసీఆర్ సహా 40 మంది నేతలు
- జాబితాకు ఆమోదం తెలిపిన ఎలక్షన్ కమిషన్
- ఈసీ అనుమతి పొందిన స్టార్ క్యాంపెయినర్లు వచ్చే నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం నిర్వహించేలా అనుమతి



హైదరాబాద్:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పార్టీకి చెందిన 40 మంది ముఖ్య నేతలు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార సారథులుగా వ్యవహరిస్తారు. బీఆర్ఎస్ - మిగతా 2లో

# కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ నిర్ణయించింది

- అధికారంలో ఉన్న పార్టీ పక్కన చేరడం మజ్లిస్ నైజం
- హైదరాబాద్‌ను సింగపూర్ చేస్తానన్న వ్యక్తి ఫాంహౌస్‌లో పడుకున్నారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- పెద్దమ్మ గుడి 11 ఎకరాల భూములు ఎంఐఎంకు: బండి సంజయ్
- కాంగ్రెస్‌కు హామీల అమలుపై చిత్తశుద్ధి లేదు: రాంచందర్‌రావు




హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ని ఎంఐఎం నేతలు నిర్ణయించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి ని ప్రకటించిన వెంటనే మజ్లిస్ నేతలు కలసి, తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పక్కలో చేరడం మజ్లిస్‌కు అలవాటేనన్నారు. కిషన్‌రెడ్డి మంగళవారం బీజేపీ అభ్యర్థి లంకెల దీపక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా యూసఫ్‌గూడలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. 'బీఆర్ఎస్ పనైపోయింది. ఆ పార్టీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్లే. హైదరాబాద్‌ను లండన్, - మిగతా 2లో



## కాంగ్రెస్ హయాంలో 80 వేల ఉద్యోగాలు

- యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 25న మెగా జాబ్‌మేళా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 80 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, - మిగతా 2లో

## వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు

- మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం..
- పదేళ్ల కిందట 125 జిల్లాల్లో .. ప్రస్తుతం
- 11 జిల్లాలకే పరిమితం: ప్రధాని మోదీ

# మహాఘట్‌బంధన్ X మహాఘట్‌బంధన్

- బీహార్‌లో ప్రతిపక్ష కూటమిలో తీవ్ర విభేదాలు
- 11 శాసనసభ స్థానాల్లో ముఖాముఖీ పోటీ
- స్నేహపూర్వక పోటీ అంటూ కూటమి పార్టీల సమర్థన
- ఎన్డీఏకు మేలు చేస్తుందంటున్న రాజకీయ విశ్లేషకులు

3లో



# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

**శాంతి భద్రతలలో పోలీస్ కీలకం**
**పోలీసు ధైర్య సాహసాలకు ప్రజలు అండగా ఉండాలి**
**అమరవీరుల సంస్మరణ దినోత్సవం లో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21:** పోలీసు అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ సంగారెడ్డి పట్టణంలోని పోలీస్ పేరేడు గ్రౌండ్లో అమరవీరుల దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్కు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అంతరం కలెక్టర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీస్ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులతో వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల సభ్యులను శాలువా తో సన్మానించారు.ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ పిప్రావీణ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే) గా నిర్వహించడం జరుగుతుందని అన్నారు . సంగారెడ్డి పోలీస్ అంటేనే ధైర్యానికి చిరునామన్నారు. విధి నిర్వహణలో తమ విలువైన ప్రాణాలను ప్రజల కోసం త్యాగం చేశారని కొనియాడారు.శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు ధైర్యసహసాలె ప్రధానమన్నారు. ప్రజలందరూ నిర్భయంగా ఏ విధమైన విఘాతాలు కలగకుండా నివసించడంలో పోలీసుల ప్రధాన పాత్ర ఉందన్నారు. దేశవ్యాప్తంగా సంఘవిద్రోహం శక్తుల కారణంగా విధినిర్వహణలో ఇప్పటివరకు 191 మంది పోలీసులు జవానులు అధికారులు అమరులు కాగా సంగారెడ్డి జిల్లాలో ఐదుగురు అమరులైనట్లు కలెక్టర్ తెలిపారు. వీరమరణం పొందిన వారి



ప్రాణత్యాగాలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో సంగారెడ్డి పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు శాంతిభద్రతల పరిరక్షణ పరంగా జిల్లా పోలీసులు రాష్ట్రంలోనే ఉన్నత స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితిలలోనైనా పోలీసు శాఖ ఎదురు నిలబడి, పోరాడటం జరుగుతుందని, అలాంటి పోలీసుల సేవలు మనందరి మదిలో చిరస్మరణీయం అన్నారు. గత జూన్ నెలలో జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శిధిలాల క్రింద చిక్కుకు పోయిన మృతదేహాలను వెలికి తీసి, తమ ధైర్య సహసాలను చాటుకున్నారు అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర మరువలేనిది అన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబ సభ్యులకు స్మరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది వీరుల స్మారకార్థంగా ఈ రోజును జరుపుకోవడం మనందరి బాధ్యత అని వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎంతో



ఆదర్శమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. వారి నిస్వార్థ సేవ మరియు త్యాగాలు జిల్లా పోలీసులకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అన్నరు.ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ. రఘునందన్ రావ్, శ్రీనివాస రావ్, సంగారెడ్డి డియస్పి. సత్యయ్య గౌడ్, జహీరాబాద్ డియస్పి సైదా నాయక్, పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, ఎఆర్.డియస్పి. నరేందర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ. కళ్యాణి, యస్.బి. ఇన్స్పెక్టర్స్ కిరణ్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, జిల్లా ఇన్స్పెక్టర్స్, ఆర్.ఐ.లు రామరావ్, పరేడ్ కమాండర్ రాజశేఖర్ రెడ్డి, పరేడ్ కమాండర్ డానియెల్అ, మరవీరుల కుటుంబ సభ్యులు హాజరై నివాళ్లులు అర్పించడం జరిగింది.


# ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు పోలీస్

**పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేము**
**పండుగలను సైతం త్యాగం చేసి**
**ప్రజల కోసం పనిచేసేది పోలీసులే**
**కరోనా సమయంలో ప్రజలకు**
**పోలీసు చేసిన సేవలను మరువలేము**
**నిరంతరం సూర్యునిలా రక్షిస్తున్న**
**పోలీసులను గౌరవించడం మనందరి బాధ్యత**

**కూకట్ పల్లి, అక్టోబర్ 21 (ప్రభాత సూర్య) :** ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు.. పోలీస్. ప్రపంచమంతా నిద్రలో ఉంటే వీరు శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగ పబ్బాల్ని కూడా త్యజించి, ప్రజల కోసం జీవించి, మరణించిన పోలీసు అమరవీరులు ఎందరో...ప్రాణాలని పణంగా పెట్టి ప్రజల కోసం పోలీసు చేసిన త్యాగానికి సానుభూతి, గౌరవం చూపిం చడం మనందరి బాధ్యత. పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడమే పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశం. అక్టోబర్ 21 అంటే పోలీసు అమరవీరుల దినం. గతంలో ప్రపంచాన్ని అంతా అతలాకుతలం చేసిన కరోనా, గత్తర కాలంలో పోలీసుల సేవలు మరువలేం. మన కాళ్లు బయటకు రాకుండా.. నిత్యం శ్రమిస్తూ అనేక మంది ఆ మహమ్మారి కరోనా కాటుకు బలైనారు. పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా



కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. అన్ని పరిస్థితుల్లో అన్ని వేళల్లో పోలీసులే ముందుంటారు. ప్రతి ఒక్కరూ ప్రతీ అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు.





శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్లను నియంత్రించడం పోలీసు కర్తవ్యం. నిద్రాహారాలు మాని డ్యూటీలు చేసే పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్నచూపే. సమయపాలన లేని విధులు, పై అధికారులతో తిట్లు, జనంతో ఛీత్కారాలు.. ఇలా ఎన్నోసమస్యలను ఎదుర్కొంటున్నారు. అనేక సమస్యలు, ఒత్తిడులు ఎన్ని ఎదురైనా సమాజమనే కుటుంబాన్ని రక్షించడానికి నిరంతరం సూర్యునిలా కృషి చేస్తున్న కృతజ్ఞతలు. వారిని గౌరవించడం మనందరి బాధ్యత.

# మంజీరా తీరాన పర్యాటక ఆకర్షణ అడ్వెంచర్ హబ్ పనులపై సమీక్ష

**: సంగారెడ్డిజిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య**

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21 :**మంజీరా తీరాన పర్యాటక అడ్వెంచర్ హబ్ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో మంజీరా నది తీరాన అభివృద్ధి చెందనున్న పర్యాటక అడ్వెంచర్ హబ్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ అధ్యక్షతన పంచాయతీ రాజ్ శాఖ విద్యుత్ శాఖ,అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మౌంట్ ఎవరెస్టు అధిరోహకులు , ట్రాన్సుసెంట్ అకాడమీ అఫ్ రాక్ క్లైంబింగ్ సంస్థ నిపుణులు పి అన్విత, ఎస్ ఆనంద్ కుమార్ ,పూర్ణ ,మంజీరా డ్యామ్ పై సాహస క్రీడలు (అడ్వాంచర్) పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మంజీరా డ్యామ్ ను సాహస క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దెందుకు గల అవకాశాలను వారు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచడానికి మంజీరా నది తీరంలో ఉన్న ప్రకృతి వైభవాన్ని వినియోగించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అడ్వెంచర్ హబ్ ద్వారా జల క్రీడలు, బోటింగ్, క్యాంపింగ్, ట్రెక్కింగ్ వంటి కార్యకలాపాలు ప్రారంభమైతే జిల్లా పర్యాటకులకు కొత్త ఆకర్షణగా మారుతుందని తెలిపారు. మంజీరా తీరాన అవసరమైన మౌలిక వసతులైన రహదారి, విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రూపకల్పనలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, సహజ వనరులపై ప్రభావం లేకుండా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.





తదుపరి దశలో ప్రాజెక్ట్ అమలుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మంజీరా అడ్వెంచర్ హబ్ పూర్తి స్థాయిలో అమలు చేయబడితే, సంగారెడ్డి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి నూతన దశ ఆరంభమవుతుందని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు స్థలాన్ని స్వయంగా పరిశీలించేందుకు అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్లు తదితర అధికారులు ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్ రావు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీవో కు వినతి పత్రం అందజేత

**-వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి**
**-వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ప్రాథమిక వసతులు కల్పించాలి...**
**-తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి**



**చౌటుప్పల్. అక్టోబర్ 21. ప్రభాత సూర్య :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలును వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆర్డిఓ వి శేఖర్ రెడ్డి కి వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బూర్గు కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఆరుకాలాలు కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యం వర్షాలతో, అధిక తూకంతో, మధ్యదాళరులతో మద్దతు ధర లేక రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని అన్నారు. అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నేటికి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధర కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాలలో ప్రాథమిక వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కావున కొనుగోలు కేంద్రాలలో విశ్రాంతి షెడ్లు, మంచినీటి సౌకర్యం, వాచ్మెన్, విద్యుత్ సరఫరా, రైతులు ధాన్యం ఆరబోసుకోవడానికి చదునైన నేల వంటి ప్రాథమిక అవసరాలను కల్పించటంతో పాటు హమాలీలకు డబ్బులు చెల్లించాలని ఆర్డీవోకు ఇచ్చిన వినతి పత్రం ద్వారా వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు పడమటి కృష్ణారెడ్డి, బొక్క యాదిరెడ్డి, ఏనుగు నర్సిరెడ్డి, గడగోటి నరసింహ, జంగయ్య, నర్సిరెడ్డి,యాదమ్మ, రంగారెడ్డి,శ్రీనివాసరెడ్డి, వెంకట్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## యాదవుల గంగాదేవి గుడి నిర్మాణానికి 50వేల విరాళం- దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి

**నల్గొండ అక్టోబర్ 21 ప్రభాత సూర్య** రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన దేవిరెడ్డి సావిత్రమ్మ కుమారుడు దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి అమెరికాలో స్థిరపడి గ్రామంలో ప్రతి సంవత్సరం తన వంతు ఆర్థిక విరాళాలు చేస్తూ సోమవారం మునిపంపుల యాదవుల కులదైవమైన గంగాదేవి గుడి నిర్మాణానికి 50 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవుల



గంగాదేవి గుడి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీహరి ముదిరాజ్ ను కలిసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిదర్శనమైన దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ముదిరాజ్ ని, వారి అధికారిక నివాసంలో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయడానికి చొరవ చూపి తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదించేలా ప్రక్రియ చేపట్టినందుకు గాను, మరియు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్. ఈ సందర్భంగా బీసీలకు ఇచ్చిన మాట మేరకు 42 రిజర్వేషన్ ఇచ్చి బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారి సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, వారిని గుర్తించి రాజకీయంతో పాటు అన్ని రంగాలలో ముందుకు రావాలని కృషి చేస్తుందని తెలిపారు. భేటీలో యువజన నాయకులు ములింటి లక్ష్మీనారాయణ, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో మియాపూర్ బిజెపి నాయకులు..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణం తో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ కు ఉప ఎన్నికలు దరిమిలా వచ్చి పడ్డాయి. బి ఆర్ ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థి గా స్వర్గీయ మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి గా నామినేషన్ లు సమర్పించినారు. ఇక ఆఖరిగా సస్పెన్స్ కి తెరతీస్తూ బిజెపి జూబ్లీహిల్స్ అసెంబ్లీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి పేరు అనూహ్యంగా తెర మీదకు వచ్చిన విషయం విదితమే నామినేషన్ ఆఖరి రోజు అయిన మంగళ వారం రోజు లంకల దీపక్ రెడ్డి నామినేషన్ ఉదయం నుండి నగరం లోని వివిధ ప్రాంతాల అభిమానం తో వచ్చిన బిజెపి పార్టీ నేతలు శ్రేణుల కోలాహలం గా ఊరేగింపు గా నామినేషన్ రిటర్నింగ్ అధికారులకి దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, గుండె గణేష్ ముదిరాజ్, పార్నంది నాగులు, జై శ్రీను, కొంచం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టి జి ఐ ఐ సి, నిమ్జ్ భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

సంగారెడ్డి, జహీరాబాద్ డివిజన్లో జరుగుతున్న భూసేకరణ పై కలెక్టర్ సమీక్ష.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21:** జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీజీఐఐసి ప్రాజెక్టులతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న (నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్) నిమ్జ్ భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అధికారులను ఆదేశించారు . మంగళవారం కలెక్టరేట్లో సంగారెడ్డి ,జహీరాబాద్ డివిజన్లో జరుగుతున్న టీజీఐఐసి, నిమ్జ్ భూసేకరణ పనులపై ఆయా డివిజన్లో ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు, టిజిఐఐసి అధికారులు, నిమ్జ్ అధికారుల తో భూ సేకరణ పనుల పురోగతిపై సమీక్షించారు. నిమ్జ్ ప్రాజెక్టు మొదటి దశ ఏర్పాటు కోసం టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 1501 ఎకరాల భూమి సేకరణ జరిపి నిమ్జ్ అధికారులకు అప్పగించినట్లు మిగిలిన భూమిని సైతం త్వరలో నిమ్జ్ కు అప్పగించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. టిజీ ఐఐసి ప్రగతి నివేదిక త్వరలో సమర్పించనున్నట్లు తెలిపారు. ఆలోపు భూసేకరణ పనులు వేగవంతం అయ్యేలా రెవెన్యూ,టిజిఐఐసి, నిమ్జ్ అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధుల అంశాన్ని టిజిఐఐసి ద్వారా తక్షణం చెల్లించేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూసేకరణకు నిధుల కొరత లేదని తెలిపారు. ఇప్పటివరకు టీజీఐఐసీ, నిమ్జ్ ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన రైతులకు ప్యాకేజీల ప్రకారం పరిహారం



అందించినట్లు కలెక్టర్ తెలిపారు . ఈ కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి , సంగారెడ్డి , జహీరాబాద్ ఆర్డీవోలు, టి జి ఐఐ సి ప్రతినిధులు, నిమ్జ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈయల్వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన

ఈయల్వి భాస్కర్ ఫౌండేషన్



**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 21( ప్రభాత సూర్య )** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల లచ్చమ్మ గూడెం గ్రామానికి చెందిన ఈయల్వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యుడు పున్న వెంకటేష్ తండ్రి పున్న నర్సింహా మరణించడు విషయం తెలుసుకున్న ఈయల్వి భాస్కర్ సూచన మేరకు ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ పున్న వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈయల్వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డి.ఎస్.పి మండల కవిత కు ఘన సన్మానం



**పెబ్బేరు అక్టోబర్ 21, ప్రభాత సూర్య** గత రెండు సంవత్సరాల నూతన అపాయింట్మెంట్ పెబ్బేరు ఏఈ గా మండ్ల కవిత పనిచేశారు . బదిలీపై శ్రీరంగాపురం మండలనికి విద్యుత్ . ఏఈ గా పనిచేశారు. కొంతకాలం సెలవు పెట్టి గ్రూప్1 కు ప్రిపేరై పరీక్ష రాశారు. మళ్లీ నాగర్ కర్నూలు జిల్లా కాన్స్ట్రక్షన్ ఏఈగా పనిచేస్తున్న కాలంలో గ్రూపు వన్ లో డీఎస్పీ సెలెక్ట్ అయ్యారు. డీఎస్పీగా సెలెక్ట్ అయినందుకు పెబ్బేరు సబ్ స్టేషన్ లో ఏ ఈ విద్యుత్ అధికారులు అందరూ కలిసి డిఎస్పి మండ్ల కవిత గారిని. శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. మండ్ల కవిత మాట్లాడుతూ మనం చదువు మీద ఇంట్రెస్ట్ పెట్టి చదివితే ఏదైనా సాధించవచ్చు. మీరు కూడా నాలాగే జాబు చేస్తూ చదువుకొని ఏ జాబు అయిన సాధించవచ్చు అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో. లైన్మెన్లు రామకృష్ణ. మధు. అశోక్ రెడ్డి. సిబ్బంది. దశరథం. పరుశురాం. రియాజ్. మహేష్. శ్రీధర్ .రవి. మనోహర్ .నరేష్. కిట్టు . మహేష్ .నాగరాజు. సాయికుమార్. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సదర్ ఉత్సవాలు...



**మాదాపూర్ ప్రభాత సూర్య :** ఘనంగా సదరు ఉత్సవాలు ఎలామేలా నరసింహ ఆదివారంలో ఘనంగా జరిగాయి. మాదాపూర్ డివిజన్ గుట్టల బేగంపేట్ లోని సదరు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సదరు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని వాళ్ళు తెలిపారు. మల్లన్న దేవాలయం నుండి మాదాపూర్ ఊరు లో నీ గుడిని దర్శించుకొని అయ్యప్ప సొసైటీలో స్టేజ్ దగ్గర దున్నపోతు కుస్తీ ఆటలో పాల్గొని తప్పకుండా విజయా సాధిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, ప్రవీణ్,సాయి, భాజ్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాల సారధి ప్రజానాట్యమండలి

కల కల కోసం కాదు కళా ప్రజల కోసం

సమరసిల పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ప్రజానాట్యమండలి

:జిల్లా కార్యదర్శి ఏ.నాగభూషణం

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21 :** ప్రజానాట్యమండలి సంగారెడ్డి పట్టణ ప్రథమ మహాసభ కేకే భవన్లో వి యేసు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఏ నాగభూషణం మాట్లాడుతూ 1943 స్వాతంత్ర పోరాట కాలంలో ఏర్పడిన ప్రజానాట్యమండలి సంఘం నాటి నుంచి నేటి వరకు నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుంది అన్నారు.భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం నైజాం ప్రభుత్వ నిరంకుషత్వానికి వ్యతిరేకంగా ప్రజలను ఉద్యమాలకు సిద్ధం చేసింది అన్నారు.నాలుగు వేల అమరుల ఆశయాలను భుజాన వేసుకొని గ్రామ గ్రామాన ప్రజలను తట్టిలేపుతుంది




ప్రజానాట్యమండలి. జిల్లా కేంద్రంలో సాంస్కృతిక ఆడిటోరియం నిర్మించాలని జిల్లా కార్యదర్శి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కళాకారులకు వర్తింప చేయాలి. వృత్తి కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలి పై సమస్యల పరిష్కారం కోసం ప్రజానాట్యమండలి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.

## కార్తీక మాస ప్రత్యేక అమావాస్య ను పురస్కరించుకొని కాళికామాతకు పూజలు



:బిజెపి నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ రమణారావు

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21:** మెదక్ జిల్లావెల్దుర్తి మండలం మన్నె వారి జలాల్ పూర్ గ్రామంలోని శ్రీ కాళికామాత దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర నామాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. రంగురంగుల పూలమాలలు పట్టు వస్త్రాలతో అమ్మవారిని అందంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలోఆలయ వ్యవస్థాపకుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు రామారావు అమ్మవారికి అభిషేకం అలంకరణ దాతలుగా ముందుకు వచ్చి అమ్మవారి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అరుణ జనార్ధన్ రెడ్డి కమిటీ మెంబర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

**పెబ్బేరు అక్టోబర్ 21 ప్రభాత సూర్య** జడ్చర్లలో అక్టోబర్ 19న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పెబ్బేరుకు చెందిన విద్యార్థిని,విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్టు కరాటే కోచ్ శ్రీనివాసులు సోమవారం విలేకరులకు తెలిపారు.జడ్చర్లలో సెకండ్ నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో పెబ్బేరుకు చెందిన సుమన్ ఫోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని గెలుపొందారు.వీరిలో బాలికల కథస్ విభాగంలో మానస, జాహ్నవి, జనని గెలుపొందారు. సీనియర్ బాలికల వెపన్స్ విభాగంలో మేఘన, జోషిక, వేదవతి గెలుపొందారు. మరియు బాలుర స్పారింగ్ విభాగంలో ట్వింకిల్ రెడ్డి, ధనుష్ గెలుపొందారని. మరియు రన్నర్ కప్పును ధనుష్ కైవసం చేసుకున్నారని కరాటే మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు



## ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం వోట్ చోరీని అడ్డుకుందాం...



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** రాహుల్ గాంధీ పిలుపునకు అనుగుణంగా ప్రజాస్వామ్యాన్ని రక్షించడం మరియు వోట్ చోరీని అడ్డుకోవడం అత్యంత ముఖ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో "వోట్ చోరీ అవగాహన కార్యక్రమం"ను విజయవంతంగా నిర్వహించారు. గత వారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన దిశానిర్దేశాల మేరకు, ఈ కార్యక్రమాన్ని మియాపూర్ డివిజన్ యువ నాయకుడు మరియు జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ నేతృత్వంలో యువత సక్రియంగా చేపట్టారు. అనంతరం, "వోట్ చోరీ అవగాహన పత్రాలను" టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ కి యలమంచి ఉదయ్ కిరణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్, వంశీ, గోకినేపల్లి రమేష్, రత్నా చారి, వాసు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 8వ వార్డు మహిళల ఆధ్వర్యంలో బొమ్మల కొలువు



**భువనగిరి, అక్టోబర్ 21(ప్రభాత సూర్య):** ఆధ్యాత్మికత చాటే దీపావళి పండుగ సందర్భంగా భువనగిరి పట్టణంలోని 8 వార్డు జంపుఖాన గూడెం కాలనీలో ప్రాంత మహిళల ఆధ్వర్యంలో బొమ్మలకొలువు నిర్వహించారు ఈ బొమ్మల కొలువు లో సమాజం కోసం కొన్ని అవగాహన కల్పించే విధంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి తాజా మాజీ కౌన్సిలర్ పంగారెక్క స్వామి పాల్గొని సమాజానికి అవసరమైన కొన్ని అంశాలను మా వార్డు మహిళలు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి సమాజ శ్రేయస్సు కు పాటుపడటం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం దీపావళి సందర్భంగా పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబితా గోపాల్, కొలుపుల అమరేందర్, మాజీ జిల్లా రైతు సమాన్వయ కమిటీ ప్రసిడెంట్ కొలుపుల విజయికుమార్,రజిత విజయలక్ష్మి, పావని,అంజమ్మ, లక్ష్మి, అనిత, శ్రీలత, పోషాలు, చంద్రిక,ఎల్లమ్మ,రాధా, సరస్వతీ, మొగ్గలక్ష్మి, కలమ్మ, పుష్ప,వార్డు మహిళలు ప్రజలు పాల్గొన్నారు

## తెలంగాణ రైజింగ్ సిటిజన్ సర్వే లో ప్రజలందరూ పాల్గొనాలి.


: జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పిలుపు .

ఈనెల 25 తో ముగియనున్న సర్వే



**ప్రభత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 21:**తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున డబ్ల్యు డబ్ల్యు. తెలంగాణ గవర్నమెంట్ ఇన్ అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## ఎంబీసీ చైర్మన్ జెరిపేట్ జైపాల్ జన్మదిన వేడుకలలో బీసీ ఐక్యవేదిక నాయకులు..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంబీసీ చైర్మన్ జెరిపేట్ జైపాల్ జన్మదిన సందర్భంగా బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ జెరిపేట్ జైపాల్ నివాసం లో తన సహచర బృందం తో కలిసి శాలువలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జెరిపేట్ జైపాల్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సేవ చేయాలని కోరుకున్నారు. బీసీల అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయన్న ముదిరాజ్, బీసీ సంఘం యువ నాయకులు అందెల కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి, సీనియర్ రిపోర్టర్ కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ బండి రామకృష్ణ గౌడ్, గోపి నగర్ బీసీ సంఘం అధ్యక్షులు సిరిపురం హరికృష్ణ చారి తదితరులు పాల్గొని జెరిపేట్ జైపాల్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సంపాదకీయం

# వ్యవస్థలో పాతుకపోయిన కుల వివక్ష

అత్యున్నత అధికార పీఠాలు అణగారిన వర్గాలకు అందుబాటులోకి వచ్చినా, సామాజిక వాస్తవికత ఆ పదవులను కూడా వివక్షా క్షేత్రాలుగా మారుస్తోంది. ఈ అధికార–సామాజిక వైరుధ్యం భారత ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయ సాధనకు సవాలుగా పరిణమించి అణగారిన వర్గాల ప్రతీకార ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. అణగారిన వర్గాలు కేవలం పదవులను పొందడం మాత్రమే కాకుండా, ఆ పదవుల ద్వారా వ్యవస్థాగతమైన వివ క్షను సమూలంగా ఎదుర్కొనే చట్టబద్ధమైన అధికారా న్ని సాధించాలని. అలాగే వ్యవస్థీకృత వివక్షను ఎదు ర్కొనేం దుకు రాజకీయ అధికారం, ఏకీకృత శక్తి తప్పనిసరి అని ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు తెలియజేస్తున్నాయి. భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అణగారిన నేపథ్యం నుంచి ఈ అత్యున్నత పదవికి చేరుకున్నారు. ఆయన స్థానాన్ని అంగీకరించలేని కులతత్వ రాజ్యాధికార ఆధిపత్యం ఇటీవల కోర్టు హాలులోనే ఒక న్యాయవాది దాడి చేసేందుకు ప్రయత్నించడం ద్వారా బహిర్గతమైంది. ఈ దాడి న్యాయవ్యవస్థను ధిక్కరించడమే కాక, దీని వెనుక అణగారిన నేపథ్యం పట్ల ఉన్న తీవ్ర పక్షపాతమే దాగి ఉందని స్పష్టమైంది. ఈ ఘటనపై జరిగిన దేశవ్యాప్త చర్చ, సమాజంలో అట్టడుగున ఉన్న కోట్లాది మంది నిస్సహాయ ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న తిరస్కరణకు, అగౌరవానికి ప్రతీకగా మారింది. ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ వివక్ష ఎదురైనప్పుడు, అది నిస్సహాయ ప్రజల గళాన్ని ఏకం చేసి, రాజ్యాంగ విలువలకు రక్షణగా నిలబడాల్సిన స్థానంలో సైతం పోరాడవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. ఈ దాడిని అణగారిన నాయకత్వంపై ఆధిపత్య వర్గం చూపే తిరస్కరణగా, న్యాయవ్యవస్థ రాజ్యాంగ సమగ్రతను బలహీనపరిచేందుకు జరిగిన ధిక్కార చర్యగానే చూడాలి. హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి వై. పురాణ్ కుమార్ ఆత్మహత్య ఘటన, ఉన్నత పదవుల్లోని వ్యవస్థీకృత వివక్షకు తిరుగులేని సాక్ష్యం. అణగారిన వర్గానికి చెందిన పూరన్ కుమార్, సీనియర్ అధికారుల నుంచి కులం పేరుతో వేధింపులు, అవమానాలు, తప్పుడు కేసుల బెదిరింపులు ఎదుర్కొన్నట్లు తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్నారు. అత్యున్నత పోలీస్ అధికారిగా ఉన్నా, ఆయనను లక్ష్యంగా చేసుకుని వేధింపులు ఆత్మహత్యకు దారితీయడం.. అధికారం అట్టడుగు వర్గానికి చేరినా, దానిపై వివక్ష నీడ పడుతుందనడానికి నిదర్శనం. ఈ సంఘటన, అణగారిన సమాజంలో తీవ్ర ఆగ్రహాన్ని, అభద్రతా భావాన్ని రేకెత్తించింది. పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా అణగారిన సంఘాలు ఏకమై నిరసనలు తెలుపడం, నిస్సహాయ ప్రజల గళం ఏకమవడానికి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడటానికి కారణమైంది. ఉన్నత పదవిలో ఉన్న అధికారి ఆత్మహత్య, కేవలం పాలనా వైఫల్యం కాదు. ఇది వ్యవస్థీకృత దౌర్జన్యానికి, రాష్ట్ర నైతిక నిర్మాణానికి జరిగిన ఘోర విఘాతంగా విశ్లేషించబడుతోంది. ఈ విషాదం, ఉన్నత స్థానంలో ఉన్న బహుజనుడికి సైతం రాష్ట్ర యంత్రాంగం రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందిందని నిస్సహాయులకు స్పష్టం చేసింది. ఈ అంతర్గత వైఫల్యంపై ఉద్యమం తలెత్తింది. గతంలో ఒక మంత్రి పరిస్థితి గంజీల ఈగను గుంజేసినట్లు ఉండేది. ఇప్పుడు పీటలపై కుర్చోవడం, కుర్చీ నుంచి లేపడం, ఒక మంత్రిని, తోటి మంత్రి వివక్ష వాఖ్యలు చేయ డం, సదరు మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలు, మాదిగ వర్గానికి చెందిన నాయకుడైనందునే జరిగాయని అణగారిన సంఘాలు ఆరోపించాయి. ఇలా ఏ కోణంలో చూసినా ఆ వాఖ్యలు మంత్రి పదవిలో ఉన్న తోటి మంత్రిపై చూపిన అగౌరవాన్ని ప్రతిబింబించాయి. అణగారిన సంఘాల ఒత్తిడితో చివరకు తోటి మంత్రి క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఈ ఘటన, తమ ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవడానికి, తమ రాజకీయ శక్తిని మరింత పటిష్టం చేసుకోవడానికి నిస్సహాయ ప్రజల గళం ఏకం కావాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. ఈ పోరాటంలో వ్యక్తిగత ఆత్మగౌరవం, వర్గ ఆత్మగౌరవంగా రూపాంతరం చెందుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అసెం బ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ నుంచి ఎదుర్కొన్న వ్యాఖ్యలు, అధికారంలో ఉన్నప్పటికీ గిరిజన నేపథ్యం పట్ల ఉన్న చిన్నచూపును ప్రతిబింబించాయని విమర్శకులు అరోపించారు. ఒవైసీ, తాను చెప్పేది సీతక్కకు అర్థం కావడం లేదంటూ, 'ఆమెకు ఉర్దూ, ఇంగ్లీష్ రాదు' అని వ్యంగ్యంగా మాట్లా డడం, గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన నాయకురాలిని, ఆమె ఆదివాసీ గుర్తింపును, నేపథ్యాన్ని కించపరిచేలా ఉం దంటూ విమర్శలు వెల్లువెత్తాయి. పోరాటాల ద్వారా ప్రజా జీవితంలోకి వచ్చిన సీతక్కను లక్ష్యంగా చేసుకొని భాషా ప్రాతిపదికన అగౌరవపరచడం, కేవలం వివక్షకి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఘటనలు అణగారిన వర్గాల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతుందనడానికి ప్రబలమైన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని వాదిస్తున్నారు. అందుకే వ్యవస్థీకృత వివక్షను ఎదుర్కొనేందుకు రాజకీయ అధికారం, ఏకీకృత శక్తి తప్పనిసరి. కేవలం సంక్షేమం లేదా రిజర్వేషన్లు కాదు. ఇది వ్యవస్థాగత వివక్షను కూలదోసి, రాజ్యాంగ రక్షణను నిజంగా అమలు చేయగలిగే 'బలహీనుల కోసం బలమైన అధికారం' అనే సిద్ధాంతాన్ని భారత రాజకీయాల్లో స్థాపించడం. అణచివేతకు అంతిమ సమాధానంగా, దేశవ్యాప్త సామాజిక ఉద్యమానికి నాంది పలకాలని ఆశిస్తున్నారు. నిస్సహాయ ప్రజల గళం ఏకమై, రాజకీయ అధికారాన్ని తమ రక్షణకు, అభివృద్ధికి వినియోగించుకున్నప్పుడే, రాజ్యాంగ సమానత్వం సంపూర్ణంగా సాకారమవుతుంది.

# విప్లవ జ్వాల అమరజీవి అష్ఫాఖ్

మాతృదేశ విముక్తి పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన యువ విప్లవ కారుల్లో అష్ఫాఖుల్లా ఖాన్ ప్రముఖుడు. వయసుకు మించిన పరిణితితో కేవలం 27 సంవత్సరాలకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి, దేశంకోసం ఉరితాడును ముద్దాడిన మేరునగ ధీరుడు. మాతృభూమిని ఆంగ్లేయుల దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేయాలనుకున్న క్రమంలో తనత్యాగం వృధా పోదని, మరెందరో త్యాగధనులకు స్ఫూర్తినిస్తుందని నిర్భయంగా ప్రకటించిన సాహస వీరుడు. తనదేశం తప్పకుండా స్వేచ్ఛా వాయువులు పీలుస్తుందని, అతిత్వరలో బానిస సంకెళ్ళు తెగిపోతాయని ధీమాగా పలికిన దేశభక్తుడు. దేశంలోని కోట్లాది మంది ముస్లింలలో దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ఎక్కబోతున్న మొట్ట మొదటి అదృష్టవంతుడిగా గర్వపడుతున్నానంటూ ఉరితాడును ముద్దాడి తానే మెడలో వేసుకున్నధీశాలి. నా దేశ సోదరులారా.! మీరు మొదట భారతీయులు. ఆ తర్వాతే మీమీ మతధర్మాలు. మీరు ఏమతం వారైనప్పటికీ పరస్పరం కలహించుకోకండి. ఐకమత్యంతో ఆంగ్లేయులను ఎదిరించండి. దేశ విముక్తే మన లక్ష్యం కావాలి '. అంటూ దేశంపట్ల బాధ్యతను గుర్తుచేస్తూ కర్తవ్యబోధ చేసిన దార్శనికుడు. ఆంగ్లేయులకు కంటిమీద కునుకు ల్లేకుండా చేసి ముచ్చెమటలు పట్టించిన అష్ఫాఖుల్లాఖాన్ 1900 సంవత్సరం అక్టోబర్ 22 తేదీన ఉత్తర ప్రదేశ్ లోని షాజహాన్‌పూర్ లో జన్మించాడు. మజ్హరున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ తల్లిదండ్రులు. ఆరుగురు సంతానంలో అష్ఫాఖ్ చిన్నవాడు. మిషనరీ స్కూల్ లో చదువుకున్నాడు. తల్లి దండ్రులు విద్యావంతులు. తండ్రి షఫీఖ్ పోలీసు శాఖలో ఉద్యోగం చేశాడు. అష్ఫాఖ్ ప్రాథమిక ఇస్లామీయ పరిజ్ఞానమంతా తల్లి వద్దనే నేర్చుకున్నాడు. అష్ఫాఖ్ కు ధార్మిక విద్యలో మంచి శిక్షణ ఇప్పించాలనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు ఒక ధార్మిక గురువును ఏర్పాటు చేశారు. ఆ పండితుడు కూడా గొప్ప దేశభక్తుడు. ఎట్టి పరిస్థితిలోనూ విదేశీ వస్తువులు వాడేవాడుకాదు. ఆంగ్లేయుల అరాచకాలను, వారి ఆధిపత్య ధోరణిని అష్ఫాఖ్ కు విడమరచి చెప్పేవాడు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి విముక్తి కల్పించడం గొప్ప పుణ్యకార్యమని, వారికి సహకరించినా, వారితో స్నేహం చేసినా నరకం రుచి చవిచూడాల్సి ఉంటుందని చెప్పేవాడు. గురువు మాటలు అష్ఫాఖ్ ను అమితంగా ప్రభావితం చేశాయి. స్వయంగా తల్లికూడా విద్యాధికురాలు కావడంతో పిన్న వయసులోనే అతనికి గొప్ప జ్ఞాన సంపద సమకూరింది. కుటుంబ నేపథ్యం రాజకీయాలకు అతీతమైనా, తన ఆలోచనలు మరోలా సాగేవి. దీంతో అష్ఫాఖ్ ఎప్పుడెప్పుడు విప్లవోద్యమంలోకి దూకాలి, ఎప్పుడు బ్రిటిషర్ల ముష్కర పాలన నుండి దేశానికి విముక్తి కల్పించాలి.. అని కలలు కంటూ ఉండేవాడు. సరిగ్గా ఆసమయంలోనే గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం కూడా ప్రారంభమైంది. విద్యార్థిగా ఉంటూనే అష్ఫాఖ్ ఆ ఉద్యమంలో



పాలు పంచుకున్నాడు. విదేశీ వస్తువులను వాడడం , ఆంగ్ల వస్త్ర ధారణ చేయడం మానేశాడు. విదేశీ వస్తువుల వాడకం ఆంగ్లేయుల బానిసత్వానికి చిహ్నమని, వీటి వాడకం మానేయాలని ప్రచారమే ప్రారంభించాడు. ఈచర్య కుటుంబీకుల్ని కలవర పరిచింది. మిషన్ స్కూల్ ఆయన్ని పాఠశాలనుండి బహిష్కరించింది. అయినా సరే అష్ఫాఖ్ బెదరలేదు, నిరాశ చెందలేదు. ప్రపంచంలోని ప్రభావవంతమైన విప్లవ వీరుల చరిత్రలు చదివి ప్రేరణ పొందేవాడు. తను కుడా వారికి లాగానే మాతృదేశంకోసం పోరాడి చరిత్రలో నిలిచి పోవాలని, దానికోసం తాను ఏమైపోయినా పరవాలేదని దృఢంగా నిర్ణయించుకున్నాడు. మిషన్ స్కూల్లో విప్లవ దళ సభ్యుడు, సహ విద్యార్థి రాజారాం కోసం వెదికాడు. కాని అతని జాడ దొరకలేదు. ఇతర విప్లవ దళ సభ్యులను కలుసుకోడానికి ప్రయత్నించి, చివరికి రాంప్రసాద్ బిస్మిల్ ను కలుసుకోగలిగాడు. తనుకూడా అష్ఫాఖ్ కు లాగానే దేశ విముక్తికోసం కలలు గంటూ దేనికైనా సిద్ధమని రంగంలోకి దూకిన విప్లవకారుడు. పదహారణాల సనాతనవాది. ఆర్యసమాజీకుడు. ఒకవైపు అష్ఫాఖ్ సాంప్రదాయ కుటుంబానికి చెందిన ముస్లిం. మరోవైపు సనాతన హిందూ కుటుంబానికి చెందిన ఆర్య సమాజ సభ్యుడైన హిందువు. ఉప్పు, నిప్పు లాంటి పరిస్థితి. చాలాకాలం ఇద్దరి మధ్య సఖ్యత కుదరలేదు. కాని ఇద్దరి లక్ష్యం ఒక్కటే.. బానిస బంధనాలనుండి దేశానికి విముక్తి. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం ఒక్కటై భావితరాలకు ఆదర్శంగా నిలిచిపొయ్యారు. ఇప్పుడు వీరికి ఉద్యమ అవసరాలకోసం పైకం కావాలి. దానికోసం ఒక పథకం ఆలోచించి, ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగష్టు 9 వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ , చంద్రశేఖర్ ఆజాద్ , రాజేంద్ర లాహిరి, రోషన్ సింగ్ లాంటి మరికొందరు విప్లవ మిత్రులతో కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిషోడి ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంతపనైతే, ఉద్యమ కారులకు కొత్త ఉత్సాహాన్ని అందించినట్లయింది. దీంతో ఆంగ్లాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సోదాలు ముమ్మరం చేసి, సెప్టెంబరు 26 న రాంప్రసాద్ బిస్మిల్ ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ ఇంటిపైకూడా పోలీసులు దాడిచేశారు. కాని అష్ఫాఖ్ వారికి దొరక్కుండా తప్పించుకున్నాడు. ఎలాగో బనారస్ చేరుకొని పది నెలలపాటు అక్కడే ఒక కంపెనీలో పనిచేశాడు. తరువాత ఇక ఏమాత్రం అజ్ఞాతంలో ఉండలేక దేశానికి ఉపయోగపడాల్సిందేనని, దానికోసం మార్గాలు అన్వేషిస్తూ ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడొక మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంతప్రయత్నించినా అష్ఫాఖ్ ఏమాత్రం భయపడలేదు. చివరికి 1927 డిసెంబర్ 19 వ తేదీన అష్ఫాఖ్ ను ఉరితీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ అష్ఫాఖ్ , మాతృదేశ విముక్తికోసం ఉరికంబాన్నెక్కబోతున్నందుకు గర్వపడుతున్నానని సగర్వంగా ప్రకటించాడు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఇన్నికోట్ల మంది ముస్లిం జనాభాలో దేశంకోసం బలిపీఠమెక్కబోతున్న తొలి ముస్లిను తానే అయినందుకు సంతోషంతో పొంగిపోతున్నాని గర్వంగా చెప్పుకున్నాడు. ఉరితాడును పూమాలగా స్వీకరించిన ఈధీశాలి, ' నా మాతృదేశమా.. సదా నీసేవ చేస్తూనే ఉంటా.. ఉరిశిక్షయినా, యావజ్జీవమైనా.. సంకెళ్ళ దరువుతో నీ కీర్తిగానం చేస్తూనే ఉంటా.' అని కవితాత్మకంగా తన దేశభక్తిని చాటిచెప్పాడు. ఆరోజు రానే వచ్చింది. అష్ఫాఖ్ తెల్లవారు ఝామున్నే నిద్రలేచి స్నాన పానాదులు ముగించుకున్నాడు. శుభ్రమైన వస్త్రాలు ధరించాడు. ప్రాతఃకాల ఫజర్ నమాజు (దైవప్రార్థన) ఆచరించాడు. తరువాత ఖురాన్ పారాయణం లో లీనమైపోయాడు. అంతలో జైలు అధికారులు అక్కడికి వచ్చారు. వారిని చూస్తూ పలకరింపుగా, ' ఏర్పాట్లు పూర్తయ్యాయా ? 'అని ప్రశ్నించాడు చిరునవ్వుతో.. 'మన్నించండి, మేము నిమిత్తమాత్రులం' అన్నారు వారు. ' అయ్యో.. ఉద్యోగులుగా మీ ధర్మం మీరు నెరవేర్చారు. ఇందులో మీ తప్పేమీ లేదు.' అంటూ, ఖురాన్ గ్రంథం చేత పట్టుకొని ' దేవా..వచ్చేస్తున్నా..!' అంటూ వధ్యస్థలి వైపుకు కదిలాడు అష్ఫాఖ్ చిరుదరహాసంతో..ప్రాతఃకాల ప్రకృతి మాత ఈతతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూఉండి పోయింది. అమరజీవి అష్ఫాఖుల్లా ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపొయ్యాయి. కేవలం 27 సంవత్సరాల అతి పిన్నవయస్సుడైన దేశభక్తుడు నిండునూరేళ్ళ జీవితాన్ని పణంగా పెట్టి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచాడు. వందేళ్ళ కీర్తిని మూటగట్టుకున్నాడు. భూప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ షహీద్ అష్ఫాఖ్ త్యాగం సజీవంగా ఉంటుంది.

# నత్తి జబ్బు కాదు... ఇబ్బందే

నత్తి అనగా అసంకల్పిత పునరుక్తుల ద్వారా ప్రసంగ ప్రవాహమునకు విఘాతం కలిగించే ప్రసంగ లోపం. దీనిలో శబ్దాలు, పదాంశాలు, పదాలు లేదా పదబంధాల యొక్క పొడిగింపు అలాగే అసంకల్పిత నిశ్శబ్ద అంతరాయాలు లేదా నిరోధాలు ఉంటాయి, అందువలన నత్తి ఉన్న వ్యక్తి ధ్వనులను స్పష్టంగా పలకడం సాధ్యం కాదు. ఎవరైనా మాట్లాడే టప్పుడు మాటలు తడబడటం లేదా ముద్ద ముద్దగా మాట్లాడటం, కొన్ని అక్షరాలు సరిగా పలక లేకపోవడం జరుగు తుంటుంది. ఈ విధంగా తరచుగా జరుగు తున్నట్లయితే వారికి నత్తి ఉందని అర్థం. ప్రపంచ నత్తి నివారణ అవగాహనా దినోత్సవమును ప్రతి సంవత్సరం అక్టోబరు 22న జరుపు కుంటారు. 1998, అక్టోబరు 22న 'ఇంటర్నేషనల్ ఫ్లూయెన్సీ అసోసియేషన్', 'ఇంటర్నేషనల్ స్టటెరింగ్ అసోసియేషన్', యూరోపియన్ లీగ్ ఆఫ్ స్టటెరింగ్ అసోసియేషన్' సంస్థలు సమావేశమై నత్తిపై ప్రజలకు అవగాహన కలిగించటం ద్వారా దానిని నివారించవచ్చని ఒక నిర్ధరణకు వచ్చాయి. అంతే కాకుండా ప్రతి సంవత్సరం అక్టోబరు 22న అంతర్జాతీయ నత్తి నివారణ అవగాహనా దినోత్సవం నిర్వహించాలని పిలుపు నిచ్చాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం పలు దేశాలు, సంస్థలు "నత్తి" నివారణ పట్ల అవగాహనా కార్య క్రమాలు నిర్వహిస్తున్నాయి. మనం మాట్లాడేటప్పుడు అక్షరాలు ఒక దాని తరువాత మరోటి నిర్దిష్ట సమయంలో ఉచ్చరించడం వలన ఇతరులకు ఆ ధ్వనులు స్పష్టంగా వినిపిస్తాయి. ఊపిరితిత్తుల నుండి బయటకు వచ్చేగాలి, స్వరపేటిక లోని స్వరతంత్రుల ప్రకంపనలతో స్వరంగా మారి బయటకు వచ్చే టప్పుడు నాలుక పలు విధాలుగా కదిలించడం వలన అనేక శబ్దాలు ఉచ్చరించ గలుగుతాము. ఈ ప్రక్రియ మొత్తం మెదడు పర్య వేక్షణలో అతివేగంగా జరుగుతూ కొన్ని సెకండ్ల వ్యవధిలోనే పూర్తవు తుంటుంది. అయితే ఈ ప్రక్రియలో ఒక్కోసారి కొన్ని అసమానతలు తలెత్తి స్వరతంత్రులు సరైన సమయానికి తెరచుకోక పోవడం, నాలుక నిర్దిష్ట సమయంలో కదలక పోవడం లేదా నాలుక ఒకే చోట ఎక్కువ సేపు ఉండిపోవడం వలన శబ్దాలు, పదాలు, వాక్యాలు ఆగి ఆగి రావడం లేదా అవే ధ్వనులు మళ్ళీ మళ్ళీ రావడం జరుగుతుంది. పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న వారికి మాటలు నత్తిగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొంత మందిలో భయం, టెన్షన్, ఇతరులను అనుకరించడం వల్ల, వంశపారంపర్యంగా నత్తి వస్తుంది. కొందరిలో ఒక అక్షరం బదులు ఇంకొక అక్షరం పలుకు తుంటుంది. వీటిని స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చు. నేటి రోజుల్లో చిన్న పిల్లలు నత్తినత్తిగా మాట్లాడటం ఒక సాధారణ సమస్యగా మారింది. ముఖ్యంగా ఈ సమస్య 2సంవ త్సరాల నుండి 5ఏళ్ళ మధ్య ఉంటుంది. చిన్న పిల్లలు నత్తి నత్తిగా మాట్లాడటాన్ని ఇంగ్లిష్‌లో స్టామరింగ్ లేదా స్టట్టరింగ్ అంటారు. ఒక పదాన్ని ఉచ్చరించే సమయంలో తొలి అక్షరాన్ని పదే పదే పలుకుతూ ఉండటం, లేదా ఆ పదాన్ని గబుక్కున ఉచ్చరించలేక అదే మాటను మళ్లీ మళ్లీ అంటుం డటం, ఒక్కోసారి మాట ఆగిపోయి ఒక పట్టాన గొంతు పెగిలి బయటకు రాకుండా ఉండటం... ఇవన్నీ స్టామరింగ్ లేదా స్టట్టరింగ్‌లో భాగమే. స్టామరింగ్ అన్నది చాలా సాధారణ సమస్య. నత్తికి చాలా కారణాలు ఉన్నాయి. జన్యుపర మైన, న్యూరో ఫిజియలాజికల్ మార్పుల వల్ల ఒక్కోసారి నత్తి రావచ్చు. నత్తి ఉన్న పిల్లల్లో కొందరికి వినికిడి సమస్య కూడా ఉండవచ్చు. కాబట్టి పై సమస్యలు ఉన్నాయా లేదా అని పరీక్షించడం చాలా ముఖ్యం. పిల్లల మానసిక స్థితిని సరిగ్గా అర్థం చేసుకోకుండా వారిని ఇతరులతో పోల్చిచూడటం, వాళ్లపై ఒత్తిడి పెంచడం వంటి కారణాలతో స్టామరింగ్ ఇంకా ఎక్కువ కావచ్చు. మాటలు నేర్చుకునే వయసు పిల్లల్లో స్టామరింగ్ అన్నది చాలా సాధారణంగా కనిపించే సమస్య. అయితే వాళ్లలో వయసు పెరుగుతున్న కొద్దీ సమస్య తగ్గుతూ ఉంటుంది. పిల్లల్లో ఒకవేళ స్టామరింగ్ ఉంటే... ఐదేళ్లు వచ్చేనాటికి 65 శాతం మంది పిల్లల్లో, యుక్తవయసు వచ్చేదానికి ముందుగా 75 శాతం మందిలో ఈ సమస్య తగ్గిపోతుంది. నత్తి బాలికలంటే బాలురలో నాలుగు రెట్లు అధికంగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 15 మిలియన్ల మందికి నత్తి ఉంటే అందులో అధికంగా పిల్లలే ఉన్నారని అంచనా. రెండు నుంచి ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కొందరిలో అకస్మికంగా నత్తి మాటలు వస్తాయి. కొంతకాలం కొనసాగుతాయి. నత్తిగా మాట్లాడే వారిని ఎగతాళి చేయకూడదు. ఇతరులు ఎగతాళి చేసిన కొద్దీ వారి సమస్య మరింత పెరగగలదు. నత్తి అనేది రోగం కాదు, వీరిలో శారీరకంగా ఎటువంటి సమస్యలూ ఉండవు. అందువలన మందులు శస్త్ర చికిత్సల వలన ఇది నయం కాదు, కాని వారిలో మానసిక ఒత్తిడిని, భయాన్ని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానం ద్వారా నత్తిని నయం చేయవచ్చు. ఈ ప్రత్యేక చికిత్సా విధానంలో మాట్లాడే క్రమంలో స్వరతంత్రులు, నాలుక, పెదవుల కదలికలు, గాలి సరఫరాలోని అసమానతలు సరిచేయడం, వాటిని సమన్వయంతో పని చేయించ గలడం జరుగుతుంది, తద్వారా నత్తి ఉన్నవారు మామూలుగా మాట్లాడ గలుగుతారు. వాస్తవంగా జబ్బు కాదు. ఇబ్బంది మాత్రమే. మాటలు తడబడుతున్నా, ఆగుతూ, సాగుతూ ముక్కలు ముక్కలుగా వస్తున్నా నిపుణులను సంప్రదించాలి. స్పీచ్ థెరపీ చేస్తే నత్తి నూరు శాతం తగ్గుతుంది. వయస్సును బట్టి థెరపీ ఉంటుంది. స్పీచ్ ట్రైనింగ్ ద్వారా సాధారణం గానే మాట్లాడేలా చేయవచ్చు. నత్తి ఉన్న పిల్లలు మాట్లాడు తున్నప్పుడు వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. వాళ్లను తొందర పెట్ట కూడదు. వాళ్లకు మాట మాట్లాడు తున్నప్పుడు నత్తి వస్తుంటే వాళ్ల తరపున మనమే మాట్లాడ కూడదు. వాళు మాట్లాడు తుండగా మధ్యలోనే అందుకుని మాట్లాడ కూడదు. వాళ్లు చెప్పదలచు కున్నది పూర్తిగా చెప్పే వరకూ ఆగి వినాలి. వాళ్లను పూర్తిగా మాట్లాడ నిచ్చేలా ప్రోత్సహించాలి. స్పీచ్ ఫ్లుయెన్సీ, స్టామరింగ్ మాడిఫికేషన్ వంటి స్పీచ్‌థెరపీ ప్రక్రియల ద్వారా మంచి ప్రయోజనం ఉంటుంది. చాలా మంది భాషావేత్తలు, వక్తలు ప్రాక్టీస్ ద్వారా నత్తిని జయించిన వారు ఉన్నారు. నత్తిని అధిగమించాలి అనుకున్నవారు ఈఎన్‌టీ నిపుణులను, స్పీచ్ థెరపిస్టులను సంప్రదించాలి. అదే సమయంలో ఈ సమస్యకు ఇంట్లో కూడా కొన్ని సాధారణ విధానాలు మరియు పద్ధతులను ఉపయోగించి సమస్యను అధిగమించవచ్చు.

## కార్తీక మాసం పరమ పవిత్రం

బతుకమ్మ పండుగ తర్వాత దసరా సరదాలు కూడా అనుభవించాం. దీపావళి వెలుగుల్లో మన ఇంటికి సంతోష తోరణాలు కట్టాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ బహుళ అమావాస్యతో మాసం పూర్తి అవుతున్నది. ఈ రోజు (21 అక్టోబర్ 2025) గుజరాతీల సంవత్సరాదిగా పాటిస్తున్నాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ మాసం ముగుస్తూ 22 అక్టోబర్ 2025 రోజున పరమ పవిత్ర కార్తీక మాసం మొదలు అవుతున్నది. "కార్తీక మాసం కన్న పరమ పవిత్ర మాసం లేదని, మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడని, వేదానికి సమానమైన శాస్త్రం ఏదీ లేదని, గంగతో సమానమైన తీర్థం లేదని" స్కంద పురాణం పేర్కొంటున్నది. శివారాధన విశిష్టమైన కార్తీక మాసం 22 అక్టోబర్ నుంచి 20 నవంబర్ 2025 వరకు కొనసాగుతుంది. మహిమాన్వితమైన కార్తీక మాసంలో పరమేశ్వరుడిని విశేష భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం. దామోదర మాసంగా పిలుచుకునే పండుగగా అశేష భక్తకోటి పారవశ్యంలో మునిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వన భోజనాలతో భక్తి వరదలతో గుడుస్తుంది. కార్తీక మాసంలో సత్యనారాయణ వ్రతాలు, విష్ణుసహస్రనామ పారాయణాలు, లలిత సహస్రనామ పారాయణాలు ఆచరిస్తారు. ఏడాదిలో తొమ్మిదవ నెలలో వచ్చే కార్తీక మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు లాంటివని విశేషంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది. శివున్ని పూజించడంతో మరుజన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. అశుతోషుడైన పరమ సదాశివుడు కోరిన కోర్కెలను తీర్చి సకల సౌఖ్యాలను కలిగిస్తున్నాడు. కార్తీక మాసంలో పవిత్ర నదిలో స్నానాలు చేయడంతో పాటు 365 ఒత్తులతో దీపారాధనలు చేస్తారు. పరమ పవిత్రంగా భావించే ఉసిరి చెట్టు కింద ఆవు నెయ్యితో దీపం పడతారు. ఈ మాసం దీప దానం చేస్తే చీకట్లు తొలగుతాయని, లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఆ ఇల్లు సిరి సంపదలతో నిండిపోతుందని ప్రగాఢ విశ్వాసం. తులసి కోటకు పూజలు నిర్వహిస్తారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో, పారే నీటిలో వదులుతారు.

# మావోలు లొంగిపోవాలి

-మొదటిపేజీ తరువాయి
పోలీస్ భద్రత సంక్షేమ నిధి నుండి రూ.16 లక్షల ఎక్స్‌గ్రేషియాం, పోలీస్ సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటాం..' అని సీఎం చెప్పారు.

**దేశానికే ఆదర్శంగా మన పోలీసులు**
'రాష్ట్రంలో తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పెరగనివ్వకుండా తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. తెలంగాణను పూర్తి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం. అందుకే పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛతో పాటు విస్తృత అధికారాలు ఇచ్చాం. డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా 'ఈగల్' వింగ్‌ను ఏర్పాటు చేశాం.

**కొత్త తరహా నేరాలు సవాలుగా మారుతున్నాయి**
ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసులు అందరికంటే ముందంజలో ఉండటం గర్వకారణం.
సాంకేతిక రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెప్పాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం తెలంగాణకు దక్కిన గౌరవం. సైబర్ నేరగాళ్లను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోంది..' అంటూ రేవంత్ కితాబునిచ్చారు.

**శాంతిభద్రతలు బాగున్నచోటే అభివృద్ధి**
'పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చాం. పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌లు సారథ్యం వహించడం గర్వించదగ్గ పరిణామం. కీలక విభాగాలను సమర్థవంతంగా నడిపిస్తున్న వారిని చూసి గర్విస్తున్నాం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు



కమిషనరేట్లలో ఏడుగురు మహిళా అధికారులు డీసీపీలుగా ఉన్నారు.
మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లను, ఎస్ఐలను రిక్రూట్ చేశాం. రాజకీయ జోక్యం లేకుండా రాష్ట్రంలో పోలీసులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితులు కల్పించాం. శాంతిభద్రతలు బాగున్నచోటే అభివృద్ధి సాధ్యం. ఇందులో పోలీసుల పాత్ర కీలకం. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో శాంతి భద్రతలు అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిన ఈ కాలంలో పోలీసుల ప్రతి అడుగు, మాట జాగ్రత్తగా ఉండాలి. నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇస్తూనే, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**దేశంలో ఎక్కడా లేని విధంగా నష్టపరిహారం**
సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అత్యధిక నష్టపరిహారం అందిస్తున్నాం. తీవ్రవాదులు, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్ గ్రేషియాను.. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలకు, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలకు, డీఎస్పీ, అదనపు ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలకు, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**మనది ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ పోలీసింగ్: డీజీపీ**
డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణలో బేసిక్ పోలీసింగ్ మరవకూడదని, 'ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే ఫార్ములాతో మనం ముందుకు వెళుతున్నామని చెప్పారు. 'చట్ట ప్రకారం అందరినీ సమానంగా చూస్తూ నిష్పాక్షికంగా వ్యవహరించడం 'ఫెయిర్ పోలీసింగ్' అయితే.. పక్షపాతం లేకుండా చట్టాలను అమలు చేస్తూ, శాంతిభద్రతలను కఠినంగా కాపాడటం 'ఫర్మ్ పోలీసింగ్'. విధి నిర్వహణ సరిగా చేస్తూ ప్రజల విశ్వాసాన్ని, స్నేహాన్నీ పొందడమే 'ఫ్రెండ్లీ పోలీసింగ్'..' అని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. 'అమరులు వారు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని డీజీపీకి అందజేశారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

# చివరిరోజు 189 నామినేషన్లు

బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన మంగళవారం నామినేషన్లు వెల్లువెత్తాయి. భారీ సంఖ్యలో నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్%–%2లోని షేక్‌పేట మండల కార్యాలయంలోని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి కార్యాలయం కిటకిటలాడింది. ఉదయం 8 గంటల నుంచే అభ్యర్థులు క్యూ కట్టారు. ఉదయం 11 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవగా అభ్యర్థులు భారీగా ఉండటంతో అధికారులు వారికి టోకెన్లు జారీ చేశారు. ఇలా మొత్తం 189 నామినేషన్లకు అధికారులు టోకెన్లు అందించారు. ఈ టోకెన్ల ప్రకారం అభ్యర్థులను లోపలకు పిలిచారు. ఒక్కో అభ్యర్థి నామినేషన్ సమర్పించేందుకు 15 నిమిషాలు పట్టగా రాత్రి 12 గంటల వరకు 160 నామినేషన్ల పత్రాలను మాత్రమే రిటర్నింగ్ అధికారి తీసుకోగలిగారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన అధికారులతోపాటు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్, రిటర్నింగ్ అధికారి సాయిరాం తదితరులు అభ్యర్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఈసీని బుధవారం వరకు గడువు కోరారు. దీంతో ఈసీ అనుమతి మేరకు టోకెన్లు ఎంత మందికి జారీ చేస్తే వారందరి నుంచి నామినేషన్ పత్రాలు తీసుకోవాలని.. బుధవారం ఈ ప్రక్రియ కొనసాగించవచ్చని ఈసీ నుంచి ఆదేశాలు జారీ కావడంతో ఆర్వో కేంద్రం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉప ఎన్నికకు మొత్తంగా 316 నామినేషన్లు దాఖలయ్యాయి.

**ట్రిపుల్ ఆర్ బాధితులు...**



ప్రతిపాదిత రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితుల్లో 11 మంది రైతులు సైతం మంగళవారం నామినేషన్లు వేశారు. ఆర్‌ఆర్‌ఆర్ వల్ల రోడ్డున పడుతున్నామని మొరపెట్టుకున్నా ప్రభుత్వం వినిపించుకోనందున తమ బాధలు చెప్పుకోవడానికే నామినేషన్లు వేసినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. అలాగే 10 మంది ఫార్మాసిటీ భూ నిర్వాసిత రైతులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. వారితోపాటు సుమారు 200 మంది భూ నిర్వాసితులు నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకొని తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.
అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి టీజీఐఐసీ పేరిట మార్చిన పట్టా భూములను తిరిగి రైతుల పేరిట నమోదు చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకే నామినేషన్లు వేశామని అభ్యర్థులు తెలిపారు. మరోవైపు రిటైరైనా ప్రభుత్వం నుంచి ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదంటూ పలువురు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 50 మంది మాల మహానాడు నేతలు సైతం నామినేషన్లు వేశారు. దీంతో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారి సంఖ్య భారీగా నమోదైంది.

## ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినరా?!

ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం నాగేందర్‌ను స్టార్ క్యాంపెయినర్‌గా పెట్టుకోవడం కాంగ్రెస్ దిక్కుమాలిన రాజకీయాలకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను స్టార్ క్యాంపెయినర్‌గా ఎలా నియమిస్తారని కాంగ్రెసను నిలదీశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ తరఫున నిలబడి గెలవాలని సవాల్ విసిరారు. బస్తీ దవాఖానల నిర్వాహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజారోగ్యాన్ని విస్మరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు.
బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖానను ఆయన సందర్శించి, రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి బస్తీ దవాఖానాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్లు కూల్చడం తప్ప చేసిందేమీ లేదని, ఇది ఆగాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెసను ఓడించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం



రేవంత్‌రెడ్డి నయా నరకాసురుడి అవతారమెత్తారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కాగా, హరీశ్ రావు పర్యటన జరుగుతుండగానే మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అర్ధంతరంగా వెళ్లిపోయారు. తనను కాదని, ఇతర నియోజకవర్గాల నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆయన మనస్తాపానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న హరీశ్.. ఆయనకు ఫోన్ చేసి బుజ్జగించారు. ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

## బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్లు రెడీ

-మొదటిపేజీ తరువాయి
తరఫున ప్రతిపాదించిన 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ గుప్తా ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ప్రచార వాహనాల పాస్‌లు మంజూరు చేసింది. ఈసీ అనుమతి పొందిన స్టార్ క్యాంపెయినర్లు వచ్చే నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం నిర్వహించేలా అనుమతి ఇచ్చింది. స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఇంకా మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్, మహమూద్ అలీ, వి.ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, చామకూర మల్లారెడ్డి ఉన్నారు. అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్‌జాదవ్, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ముఠా గోపాల్, చింతా ప్రభాకర్ కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాతా మధు, ఎల్.రమణ, తక్కెళ్లపల్లి రవీందర్ రావు ప్రచారంలో పాల్గొంటారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, నేతలు రావుల శ్రీధర్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, అబ్దుల్లా సోహైల్ కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు.

## కాంగ్రెస్ హయాంలో 80 వేల ఉద్యోగాలు

-మొదటిపేజీ తరువాయి
సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టిసారించామన్నారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకుల కోసం హుజూర్‌నగర్‌లో 205 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 9,500 మంది యువకులు ఉపాధి కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 5 వేల మందికి పైగా ఈ మేళా ద్వారా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తామని, భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ నిర్ణయించింది

-మొదటిపేజీ తరువాయి
న్యూయార్క్, వాషింగ్టన్, సింగపూర్‌గా మారుస్తా అన్న వ్యక్తి ఫాంహౌస్‌లో పడుకున్నారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, రాజీనామా చేసిన తరువాత ఫాంహౌస్ నుంచి బయటకు రాని వారికి ఓటు వేస్తామా'అని అన్నారు. జూబ్లీహిల్స్ అంటే అక్కడ అన్నీ అద్దాల మేడలని ప్రజలకు ఒక దురభిప్రాయం ఉందని, ఇక్కడ వీధుల్లో చూస్తే మురుగు నీరు, చెత్త, వెలగని వీధి లైట్లు, పార్కుల కబ్జాలు కనిపిస్తాయని పేర్కొన్నారు.

**గుడి భూములు ఎంఐఎంకు: బండి సంజయ్**
జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన 11 ఎకరాలను ఎంఐఎం పార్టీ వారికి రాసివ్వడానికి ముందస్తు అగ్రిమెంట్ జరిగిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సల్కం చెరువులో ఎంఐఎం కాలేజీ కడితే వారితో కాంగ్రెస్ నేతలు భాగస్వామ్యం పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో సైకిల్‌కి కూడా గతి లేని నాయకులు ఇప్పుడు కేజీల కొద్దీ బంగారు ఆభరణాలు వేసుకుని, పెద్దపెద్ద కార్లలో తిరుగుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై మేం మాట్లాడం, మూసీపై మీరు మాట్లాడకండి అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం నడుస్తోందని ఆరోపించారు. ఎంఐఎంలో ఇద్దరు జోకర్లు ఉన్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి చెరో రూ.200 కోట్లు తెచ్చుకుని, పతంగి పార్టీని యూసఫ్‌గూడ చౌరస్తాలో వేలం వేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయడానికి కాంగ్రెస్‌కు అభ్యర్థి దొరకలేదని, అందుకే మజ్లిస్ నుంచి ఒక వ్యక్తిని అద్దెకు తెచ్చుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని, దానికి జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు పాల్గొన్నారు.

## జల విద్యుత్తుతో జెన్‌కోకు 2 వేల కోట్లు!



హైదరాబాద్

రాష్ట్రంలో జల విద్యుత్తు ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరుగుతోంది. ఈ సీజన్‌లో రిజర్వాయర్లకు భారీ వరద వచ్చింది. ఆ జలాలను ఒడిసిపట్టుకొని విద్యుత్తును ఉత్పత్తి చేయడంతో ఇప్పటిదాకా తెలంగాణ జెన్‌కో రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించింది. కరెంటు యూనిట్ రూ.4 చొప్పున డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. తెలంగాణ జెన్‌కో ఈ నెల 19న అర్ధరాత్రి నాటికి 5 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 6831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి జరగ్గా.. ఆ రికార్డును ప్రస్తుత సంవత్సరంలో దాటే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టుల వద్ద 2441.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్కేంద్రాలు ఉండగా.. అందులో కృష్ణా నదిపై 2371.6 మెగావాట్ల కేంద్రాలు ఉన్నాయి. గోదావరిపై 70.2 మెగావాట్ల కేంద్రాలున్నాయి. కృష్ణా బేసిన్‌లో ప్రతి నీటి చుక్క కాసులు కురిపిస్తోంది.

**రికార్డుల దిశగా..**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2019–20లో 3963 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయగా.. 2020–21లో 3667 మిలియన్ యూనిట్ల (శ్రీశైలం ప్రమాదంతో)ను, 2021–22లో అత్యధికంగా 5655 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను ఉత్పత్తి చేశారు. 2022–23లో ఏకంగా 6831 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశారు. 2020 ఆగస్టు 20న శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆ కేంద్రంలోని ఒక యూనిట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌లో ఐదేళ్లుగా ఉత్పత్తి నిలిచిపోవడంతో 2 వేల మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తిపై ప్రభావం పడినట్లయింది. కాగా, రాష్ట్రంలో ఈ నెల 20 నాటికిజల, థర్మల్ విద్యుత్తు కలిపి 20 వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. దీంతో సీజన్ ముగిసేనాటికి జలవిద్యుత్తు ఉత్పాదన కొత్త రికార్డులు సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు.

# మహాఘట్‌బంధన్ X మహాఘట్‌బంధన్

పాట్నా

బీహార్‌లో అధికార జేడీ(యూ), బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని దించి ఈసారి ఎలాగైనా అధికారం చేపడదామని కలలు కంటున్న కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీల మహాఘట్‌బంధన్‌లో ఐక్యత కరవైంది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రకటించిన లిస్టుల్లో చిత్రంగా 11 స్థానాల్లో ఈ పార్టీలు పరస్పరం తలపడుతున్నాయి. ఇందులో ఆరు స్థానాల్లో ఆర్జేడీ, కాంగ్రెస్ నేరుగా పోటీపడుతుండగా, నాలుగు స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ రంగంలో ఉన్నాయి. అలాగే ముఖేష్ సహానీకి చెందిన వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ), ఆర్జేడీలు రెండు నియోజకవర్గాల్లో ఢీకొంటున్నాయి. అయితే తమ మధ్య ఉన్నది స్నేహపూర్వక పోటీ అని ఈ కూటమి పార్టీలు సమర్థించుకుంటున్నాయి.

**ఎన్డీఏకే ప్రయోజనమా?**

ఇలా విపక్ష కూటమిలో లుకలుకల వల్ల వ్యతిరేక ఓటు చీలి బీజేపీ నేతృత్వంలోని అధికార ఎన్డీఏ కూటమికి పలు నియోజకవర్గాల్లో ప్రయోజనం చేకూర్చవచ్చునని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మహాఘట్‌బంధన్‌లోని విభేదాలు సవాల్ విసిరే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి విజయాన్ని సులభం చేస్తుందని ఆ కూటమి భాగస్వామి పార్టీ లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. 'ఇంత పెద్ద కూటమి విడిపోయే దశలో ఉండటం నేనెక్కడా చూడలేదు. సీట్ల సర్దుబాటుపై కొద్దిపాటి వివాదాలు, విభేదాలు సహజమే. కానీ ఆయా పార్టీలు కూర్చుని ఎవరెక్కడ పోటీ చేయాలనే దానిపై ఒక అవగాహనకు రావాలి. కానీ మహాఘట్‌బంధన్‌లో ఇది కన్పించడం లేదు' అని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి తప్పుకున్న జేఎంఎం'మహాఘట్‌బంధన్'లో కాంగ్రెస్, ఆర్జేడీ తీరుతో విసిగిపోయిన జేఎంఎం కీలక ప్రకటన చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోవటం లేదని మంగళవారం ప్రకటించింది. సీట్ల పంపకంపై కాంగ్రెస్, ఆర్జేడీతో వచ్చిన విభేదాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు జార?ండ్ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సొరేన్ వెల్లడించారు.

**విపక్ష అభ్యర్థులకు బీజేపీ బెదిరింపులు**

**ప్రశాంత్ కిషోర్**

ఓటమి భయంతో పోటీ నుంచి తప్పుకోవాలని విపక్ష అభ్యర్థులను బీజేపీ బెదిరిస్తున్నదని 'జన్ సురాజ్' నాయకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, బీజేపీ తీసుకొచ్చిన ఒత్తిడి వల్లే జన్ సురాజ్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందన్నారు.

**బీహార్ ఎన్నికలకు కర్ణాటక మంత్రుల నిధుల సేకరణ!**

బెంగళూరు: బీహార్ శాసన సభ ఎన్నికల కోసం కర్ణాటక మంత్రులు నిధులు సేకరిస్తున్నారని బీజేపీ ఎంపీలు జగదీశ్ శెట్టర్, రాఘవేంద్ర సోమవారం ఆరోపించారు. ఈ నిధుల సేకరణలో సీఎం, మంత్రులు ఉండటం అధికార యంత్రాంగంలో అవినీతికి కారణమైందని వారు తెలిపారు. 'బీహార్ ఎన్నికల నిధుల కోసం మంత్రులంతా అధికారుల ద్వారా దోచుకుంటున్నారు. డబ్బులు వసూలు చేయాలని వారు అధికారులను అడిగారు. బదిలీల ద్వారా డబ్బు సేకరించిన తర్వాత, ఇప్పుడు రెన్యువల్స్ పేరు మీద వసూలు చేస్తున్నారు. ఇది వాళ్ల ప్రధాన వ్యాపారంగా మారింది' అని శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతూ రాఘవేంద్ర అన్నారు.

# వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు

పణజీ

దేశంలో నక్సల్-మావోయిస్టు ఉగ్రవాదం నిర్మూలనలో తుది అంకంలో ఉన్నామని ప్రధాని మోదీ అన్నారు. భద్రతాదళాలు 90 శాతం వరకు విజయం సాధించాయని.. వందకుపైగా జిల్లాలకు దీని నుంచి విముక్తి కల్పించాయని చెప్పారు. ఆయా జిల్లాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ దీపావళి జరుపుకొంటున్నారని అన్నారు. సదరు ఉగ్రవాదం ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితమైందని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని ఆయన గోవా తీరంలో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి పండుగ జరుపుకొన్నారు. భద్రతాదళాల ధైర్యసాహసాలను కొనియాడారు. మావోయిస్టుల ఉగ్రవాదంపై కీలక విజయాలు సాధించాయన్నారు. '2014కి ముందు దాదాపు 125 జిల్లాలు మావోయిస్టుల గుప్పిట్లో ఉండేవి. గత దశాబ్ద కాలంగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో 11 జిల్లాలకు తగ్గిపోయింది. వీటిలో కూడా మూడు జిల్లాల్లోనే మావోయిస్టుల ప్రాబల్యం ఉంది. వారి నుంచి విముక్తి పొందిన వందకుపైగా జిల్లాలు తొలిసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాయి. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' కారణంగా ఈ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఈ జిల్లాల్లో భారత రాజ్యాంగం పేరెత్తితేనే అణచివేసేవారు. ఇప్పుడక్కడ స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోంది' అని చెప్పారు. దేశంలో అంతర్గతంగా యుద్ధం చేయాలంటే ఎంతో సహనం అవసరమని, అమాయకులెవరూ చనిపోకుండా చూసుకోవలసి ఉంటుందని గుర్తుచేశారు. తమ ప్రాబల్య ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్లు, ఆస్పత్రులను నిర్మించడానికి నక్సల్స్ అనుమతించలేదని.. వాటిని పేల్చేసి డాక్టర్లను కాల్చిచంపారని తెలిపారు. ఇప్పుడవే ప్రాంతాల్లో హైవేలు నిర్మిస్తున్నామని.. స్కూళ్లు, ఆస్పత్రులు పిల్లలకు నూతన భవిష్యత్‌ను ఇస్తున్నాయని చెప్పారు. భద్రతాదళాల త్యాగాలు, ధైర్యసాహసాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పోరులో అవయవాలు



కోల్పోయి వీల్‌చైర్లకే పరిమితమైనా పోలీసు జవాన్లు పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగానూ.. ప్రాణత్యాగాలు చేసిన పోలీసులకు మోదీ నివాళులు అర్పించారు.

**'ఆత్మనిర్భర భారత్'కు విక్రాంత్ నిదర్శనం**

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్.. 'ఆత్మనిర్భర భారత్'కు తిరుగులేని నిదర్శనమని ప్రధాని తెలిపారు. దీనిని కదులుతున్న నగరంగా అభివర్ణించారు. 'త్రివిధ దళాల మధ్య అద్భుత సమన్వయం.. మన నౌకాదళం చొప్పించిన భయం.. వైమానిక దళ అసాధారణ నైపుణ్యం, సైన్యం సాహసం.. కలగలిపి 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి తీసుకొచ్చాయన్నారు. 'కొన్నేళ్లుగా భారత దళాలు స్వావలంబనతో అత్యాధునికత సంతరించుకున్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు తమ సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్‌లో నిరూపించుకున్నాయి. పలు దేశాలు ఇప్పుడీ క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లు పెరిగాయి. గత ఏడాది ఈ ఉత్పత్తులపై వ్యయం రూ.లక్షన్నర కోట్లకు చేరుకుంది. 2014 నుంచి వివిధ భారత షిప్‌యార్డులు నౌకాదళానికి 40 స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నిర్మించి ఇచ్చాయి. అంటే సగటున ప్రతి 40 రోజులకు ఓ యుద్ధనౌక, జలాంతర్గామి నిర్మించాయన్న మాట. ప్రపంచ అగ్ర రక్షణ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా నిలవాలన్నది భారత లక్ష్యం' అని స్పష్టంచేశారు. ప్రధాని ఆదివారం సాయంత్రం ఐఎన్ఎస్ విక్రాంత్‌పైకి వచ్చారు. సోమవారమంతా అక్కడే ఉన్నారు. ఉదయం యోగా సెషన్‌లో పాల్గొన్నారు. యుద్ధనౌకలు, యుద్ధవిమానాల విన్యాసాలను పరిశీలించారు.

# సెకండ్ హ్యాండ్ ఐనా.. ఐఫోనే!
# భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇదే ట్రెండ్

ఐఫోన్.. ఇది చాలామందికి స్టేటస్ సింబల్. బ్రాండ్ న్యూ ఫోన్కే కాదు.. పాతదైనా సరే ఐఫోన్కు ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సెకండ్ హ్యాండ్ మార్కెట్లో ఐఫోన్ హవా నడుస్తోంది. అమ్మకాల సంఖ్య పరంగా సామ్‌సంగ్ మనదేశంలో నెంబర్‌వన్‌గా ఉన్నప్పటికీ.. వృద్ధి రేటులో మాత్రం ఆపిల్ నంబర్‌వన్‌గా నిలిచింది. మనదేశంలో సెకండ్ హ్యాండ్ ఫోన్ల మార్కెట్లో సామ్‌సంగ్, యాపిల్ తరవాత వన్ ప్లస్, షియోమి వంటివి ఉన్నాయి. యాపిల్ తయారీ ఐఫోన్%-%16 విడుదలై, అందుబాటులోకి వచ్చిన తొలి 10 రోజుల్లో అమ్మకాలతో పోలిస్తే.. ఇటీవలే మార్కెట్లోకి వచ్చిన ఐఫోన్%-%17 మోడల్ విక్రయాలు చైనా, యూఎస్‌లో 14% అధికంగా నమోదయ్యాయి. భారత్‌లోనూ పరిస్థితి దాదాపు ఇలాగే ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కేవలం కొత్త ఐఫోన్లకే గిరాకీ ఉందనుకుంటే పొరపాటే.. మార్కెట్‌ను బట్టి ప్రపంచవ్యాప్తంగా పాత ఐఫోన్ల కోసమూ కస్టమర్లు ఎగబడుతున్నారు.

భారత్‌లో చేతులు మారుతున్న (సెకండ్ హ్యాండ్) పాత ఫోన్లలో అయిదింట మూడు ఐఫోన్లేనని రీసేల్ ప్లాట్‌ఫామ్ 'క్యాషిఫై' చెబుతోంది. ప్రీమియం మోడళ్ల పట్ల పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనం. ఆ సంస్థ సర్వే ప్రకారం కొనుగోలుదారుల్లో దాదాపు మూడోవంతు మంది.. రూ.21,000 నుంచి రూ.35,000 వరకు సెకండ్ హ్యాండ్ ఫోన్ల కోసం వెచ్చిస్తున్నారంటే క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పెరుగుతున్న ఆకాంక్ష**

ఇప్పటికే మొబైల్ ఫోన్ల విస్తృతి పెరగడం, కస్టమర్లు ఎక్కువ కాలంపాటు మొబైల్స్ వినియోగిస్తున్న కారణంగా యూరప్, యూఎస్ఏ, జపాన్ వంటి మార్కెట్లలో 2025 జనవరి%-%జూన్ మధ్య ప్రీ%-%ఓన్డ్ స్మార్ట్‌ఫోన్ అమ్మకాల్లో పెరుగుదల నమోదైంది. ఆఫ్రికా, భారత్, ఆగ్నేయాసియా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలోనూ అమ్మకాలు పెరగడం విశేషం.

ప్రీమియం మోడళ్ల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతుండడం ప్రీ%-%ఓన్డ్ అమ్మకాలకు కారణమవుతోంది. ప్రజల్లో అత్యధికులకు యాపిల్ ఫోన్లను కలిగి ఉండాలన్న ఆకాంక్ష పెరుగుతోంది. కానీ తలసరి ఆదాయం ఆ స్థాయిలో లేదు. అందుకే కొత్త ఫోన్ కొనలేకపోయినా.. కనీసం సెకండ్ హ్యాండ్ ఫోన్ అయినా సొంతం చేసుకోవాలనుకుంటున్నారు.

**భారత్‌లో 5 శాతం**

జనవరి%-%జూన్ కాలంలో 2024తో పోలిస్తే 2025లో పాత స్మార్ట్ ఫోన్ల మార్కెట్ ఆఫ్రికాలో 6 శాతం, భారత్, ఆగ్నేయాసియా దేశాల్లో చెరి 5 శాతం దూసుకెళ్లింది. యూఎస్ఏ, చైనా, లాటిన్ అమెరికా, జపాన్ దేశాలు చెరి 3 శాతం, యూరప్‌లలో ఒక శాతం వృద్ధి నమోదైందని మార్కెట్ పరిశోధన సంస్థ 'కౌంటర్‌పాయింట్' వెల్లడించింది. అయితే అన్ని మార్కెట్లలోనూ రీఫర్బిష్డ్ విభాగంలో యాపిల్ ఐఫోన్ల హవా నడుస్తుండడం విశేషం.




**19 శాతం పెరిగి..**

భారత్‌లో రీఫర్బిష్డ్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో తొలి స్థానంలో ఉన్న సామ్‌సంగ్ విక్రయాలుఈ ఏడాది జనవరి%-%జూన్ కాలంలో 1 శాతం తగ్గాయి. గెలాక్సీ ఎస్22, ఎస్21 అత్యధికంగా అమ్ముడైన మోడళ్లలో ఉన్నాయి.ఐఫోన్ 13, 14 సిరీస్ లను వినియోగదారులు ఇష్టపడు తుండటంతో యాపిల్ అమ్మకాలు ఏకంగా 19 శాతం పెరిగి, రెండో స్థానంలో నిలిచిందని కౌంటర్ పాయింట్ వెల్లడించింది.

**ఐఫోన్ ముచ్చట్లు**

' ప్రపంచవ్యాప్తంగాఐఫోన్ కస్టమర్లు..156 కోట్లకుపైమాటే
' 2024లోఅంతర్జాతీయంగా ఐఫోన్ అమ్మకాలు.. 23 కోట్లకుపైనే
' గతఏడాది భారత్‌లో అమ్ముడైన ఐఫోన్స్.. 1.2 కోట్లు
' భారత్‌లో 2024%-%25లో కంపెనీ ఆదాయం 13 శాతం వృద్ధితో 900 కోట్ల డాలర్లు
' 2025లో వాడేసిన, రిఫర్బిష్డ్ ఫోన్లప్రపంచ మార్కెట్ విలువ 6500 కోట్ల డాలర్లకుపైనేఉంటుందని అంచనా.

## రైతులకు రబీ షాక్



న్యూఢిల్లీ

ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనోఅమ్మోనియం ఫాస్ఫేట్ (టీఎమ్ఏపీ), అడ్‌బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10–15 శాతం పెరిగే అవకాశం ఉంది. భారత్ ప్రతి సంవత్సరం 2.5 లక్షల టన్నుల ప్రత్యేక ఎరువులను వినియోగిస్తోంది. వీటిలో సుమారు 60–65 శాతం రబీ (అక్టోబరు నుంచి మార్చి) సీజన్‌లోనే వాడుతున్నారు. ఈ సమయంలో ధరలు పెరిగితే రైతులపై మరింత భారం పడుతుంది. అయితే వ్యాపారులు ఇప్పటికే కొంత మేర ఎరువులను నిల్వచేయడంతో రబీ అవసరాలు తీరుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## కిక్కు దించుతున్న లిక్కర్ రేట్లు!



ముంబై

విదేశీ మద్యం ధరలు పెరగడంతో మహారాష్ట్రలో మద్యం అమ్మకాలు పడిపోయి ఎక్సైజ్ సుంకం ద్వారా ఆదాయం తగ్గిపోయింది. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ వరకు15.1 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు మాత్రమే జరిగాయి. ఇదే కాలంలో గత ఏడాది 32.19 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు జరగగా 2023–24లో 27.72 కోట్ల లీటర్ల అమ్మకాలు జరిగాయి. కొవిడ్–19 కాలంలో విదేశీ మద్యం అమ్మకాలు పుంజుకోవడం విశేషం. 2018–19లో 20.72 కోట్ల లీటర్లు, 2020–21లో 21 కోట్ల లీటర్ల విదేశీ మద్యం అమ్మకాలు జరిగాయి. ధరల పెంపు దేశీయ మద్యం అమ్మకాలపై ప్రభావం చూపింది. రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం గణనీయంగా పడిపోయింది. గత ఏడాది ఇదే కాలానికి రూ. 25,467 కోట్ల ఎక్సైజ్ ఆదాయం లభించగా ఈ ఏడాది రూ. 12,332 కోట్ల ఆదాయం మాత్రమే లభించింది. అయితే మద్యం అమ్మకాలు తగ్గడానికి ధరల పెంపు ఒక్కటే కారణం కాదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జీవన వ్యయం పెరగడం వల్ల ప్రజలు ఖర్చులు తగ్గించుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని, దీని ప్రభావం అత్యధికంగా మద్యంపై పడిందని అభిప్రాయపడ్డారు.

## గంటకు 453 కిలోమీటర్ల వేగం



బీజింగ్

రైలు ప్రయాణంలో వేగానికి సరికొత్త అర్థం చెప్తూ చైనా మరో ప్రపంచ రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సీఆర్ 450 హై స్పీడ్ రైలును ఆవిష్కరించింది. ఈ రైలు ప్రస్తుతం షాంఘై–చోంగ్‌క్వింగ్–చెంగ్డూ మార్గంలో తొలి పరీక్షలను ప్రారంభించింది. గతంలో జరిగిన పరీక్షల్లో ఈ రైలు గంటకు ఏకంగా 453 కిలోమీటర్లు (281 మైళ్లు) గరిష్ఠ వేగాన్ని అందుకుని, తన రికార్డు సామర్థ్యాన్ని నిరూపించింది. వాణిజ్య సేవల్లో ఇది గంటకు 400 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రూపొందించారు. ప్రస్తుతం గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్న పాత రైలు సీఆర్ 400 ఫ్యుక్సింగ్ మోడల్‌తో పోలిస్తే సీఆర్450 రైలులో అనేక మార్పులు చేశారు. పొడవైన ముక్కు, 20 సెం.మీ. తగ్గించిన పైకప్పుతో పాటు, మొత్తం బరువును 50 టన్నులు తగ్గించడం ద్వారా గాలి నిరోధాన్ని 22 శాతం మేర తగ్గించారు. ఈ రైలు కేవలం 4 నిమిషాల 40 సెకన్లలోనే సున్నా నుంచి గంటకు 350 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. ఇటీవల నిర్వహించిన ఒక ప్రదర్శనలో రెండు సీఆర్ 450 రైళ్లు ఎదురెదురుగా వెళ్తూ, సంయుక్తంగా గంటకు 896 కి.మీ. వేగాన్ని నమోదు చేశాయి. ప్రస్తుతం ఈ హైస్పీడ్ రైలు 6,00,000 కిలోమీటర్ల సుదీర్ఘ పరీక్షలను పూర్తి చేయనుంది. నూతన సాంకేతికతతో కూడిన ఈ రైలు పర్యావరణహితంగా, మరింత నిశ్శబ్దంగా, సురక్షితంగా ఉంటుందని చైనా రైల్వే వర్గాలు వెల్లడించాయి.

## ప్రజల ధన, మాన ప్రాణ రక్షణలో అహర్నిశలు కృషి చేస్తూ విధి నిర్వహణలో

# ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలుచిరస్మరణీయం

**వనపర్తి** : దేశ సరిహద్దులో సైనికుడు - రాష్ట్ర భద్రతలో పోలీసు ఇద్దరిదీ ఒకే త్యాగ పథం ప్రపంచమంత నిద్రపోయినా మేల్కొని వుండే ఒకే ఒక్క వ్యక్తి ? పోలీస్ అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి. పోలీసు అమరుల త్యాగాన్నిస్మరిస్తూ నివాళులు, కుటుంబ సభ్యులకు పరామర్శ పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని పోలీసు పరేడ్ మైదానంలో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన ఎస్పీ×దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీసు కూడా అంతే కీలకమని అన్నారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్పూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజా అవసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ, పోలీసు వ్యవస్థని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, , అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ వందనం స్వీకరించి అమరుల పోలీసు కుటుంబ సభ్యులు మరియు అధికారులు సిబ్బందితో కలిసి అమరవీరుల అమరవీరుల స్థూపానికి పూలమాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్పీ అమరుల కుటుంబ సభ్యులను పేరుపేరునా పరామర్శించి శాలువాతో సన్మానించి చిరుకానుకలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్మృతి పరేడ్ కు పరేడ్ కమాండర్ గా రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... సమాజంలో శాంతి స్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరనీయమని , అమరవీరులు అందించిన స్పూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని తెలిపారు. 1959 అక్టోబర్ 21వ తేదీన అఖీఖఈ ఎస్సై, కరమ్ సింగ్ నాయకత్వం లోని భారత జవాన్లు ఈశాన్య లడక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో చైనా సైనిక దళాలు జరిపిన ఆకస్మిక దాడిలో 10 మంది



భారత జవాన్లు వీరమరణం పొందారని, వీరి ప్రాణ త్యాగాలకు ప్రతీకగా ప్రతీ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీని పోలీస్ ఫ్లాగ్ డే గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31వ వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు, కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆన్లైన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, సాంకేతిక వినియోగం, ప్రజారక్షణ లో పోలీసుల సేవలు , ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ మొదలైన విషయాలను స్కూల్ పిల్లలకు తెలియజేయడం జరుగుతుంది. విద్యార్థులకు ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ, రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలి వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అసాంఘిక శక్తులతో పోరాడుతూ కార్యనిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి పేరు పేరునా నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ తామరగి మనకు, మన సమాజానికి శాంతిని స్థిరత్వాన్ని అభివృద్ధిని అందించిన మన సోదరులకు మరో గుర్తు చేసుకుంటూ వారికీ జోహారులు . అనంతరం అమర పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలో వారి సమస్యలు, సంక్షేమం గురించి ఎస్పీ ప్రత్యేకంగా చర్చించి వారికి అండగా ఉంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు , డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, జిల్లా పోలీసు కార్యాల యం ఏ ఓ, సునందన, వనపర్తి సీఐ, కృష్ణయ్య,, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూర్ సీఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, మరియు పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లాలోని ఎస్సైలు,పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థి మృతిపై విచారణ

**కరీంనగర్** : కరీంనగర్ సమీపంలోని ముగ్దుంపూర్ మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న నదిముద్దీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కళాశాల పక్కనే రాజీవ్ రహదారిపై లారీ ఢీ కొట్టడంతో విద్యార్థి నదీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ అంశంపై మైనారిటీ గురుకుల హెడ్ ఆఫీస్ హైదరాబాద్ నుంచి జిల్లా ఇన్చార్జి మహమ్మద్ సుభాన్ మంగళవారం మైనారిటీ గురుకులాన్ని సందర్శించారు. ఘటనకు జరిగిన అంశాలపై అరా తీసి, ఉద్యోగులతో, సిబ్బందితో, పిల్లలతో మాట్లాడి, వివరాలను నోట్ చేసుకున్నారు. విచారణకు వచ్చిన అధికారి సుబహాన్ ను ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఎంఐఎం నేత, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, ఖాజా మజాహారోద్దీన్ లు కలిసి కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడారు. మృతుడి కుటుంబానికి శాఖ పరంగా, ఉద్యోగుల తరపున ఆర్థిక సాయం అందించేలా కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కి విజ్ఞప్తి చేశారు.

## కొండగట్టులో ఈవో శ్రీకాంత్ రావు వినూత్న ఆలోచన

### గర్భగుడి ముఖద్వారం వద్ద స్ప్రింక్లర్స్ ఏర్పాటు

**జగిత్యాల** : ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈవో శ్రీకాంత్ రావు వినూత్న ఆలోచనతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. భక్తుల పాదాలు స్వచ్ఛంగా ఉండేలా గర్భగుడి ముఖద్వారం వద్ద స్ప్రింక్లర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పైప్ లైన్కు అనుసంధానించిన ఈ స్ప్రింక్లర్స్ ద్వారా గర్భగుడి ప్రవేశ ద్వారం వద్ద స్వయంచాలకంగా నీరు పిచికారీ అవుతుంది. దీని వల్ల భక్తులు గర్భగుడిలో అడుగుపెట్టే ముందు పాదాలు శుభ్రం అవుతూ, ఆలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటుంది. ఈ వినూత్న ఆలోచన ఆలయ శుచిత, భక్తుల సౌకర్యం పరిరక్షణలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని సిబ్బంది తెలిపారు. భక్తులు కూడా ఈ ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ, "భక్తుల సౌకర్యం కోసం మంచి ఆలోచన చేపట్టిన ఈవో అభినందిస్తున్నారు.

## నల్గొండ జిల్లా కేంద్రంలో పోలీసు అమరవీరులకు నివాళులు

**నల్గొండ** : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్పరేడ్ గ్రౌండ్లో.. 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం' ఘనంగా జరిగింది. ప్రజా సేవలో ప్రాణాలు అర్పించిన పోలీస్ లకు.. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పి శరత్ చంద్ర పవార్ లు.. ఘనంగా నివాళులు అర్పించారు. 1959 అక్టోబర్ 21న లడఖ్లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద సాయుధ చైనా సైనికులు భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి దాడి చేశారు. ఈ దాడిలో గస్తీ కాస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (అఖీఖఈ)కి చెందిన పది మంది పోలీసులు వీరోచితంగా పోరాడి అమరులయ్యారు. ఈ త్యాగాన్ని స్మరించుకోవడానికి, భారతదేశంలోని అన్ని పోలీసు దళాలు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ని పోలీసు సంస్మరణ దినోత్సవంగా పాటిస్తాయి.

## తాటికొండ రాజయ్య వాఖ్యలకు స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్** : బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య వాఖ్యలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. నాయిని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో వ్యవస్థలో గౌరవం లేకుండా,అభద్రత భావాన్ని కలిగించేలా చేశారు. ప్రమోద్ అనే కానిస్టేబుల్ మృతి పట్ల రాజకీయం చేయడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో దళిత బిడ్డ అయినా నిన్ను మంత్రి వర్గం నుండి తొలగిస్తే స్పందించిన దాఖలాలు లేవు. ప్రజలకు సుబిష్ట పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కనీస డిపాజిట్ తెచ్చుకోలేరు అని ఎద్దేవా చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు

**కరీంనగర్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం మానకొండూరు మండలంలోని వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్, మెడిసిన్ స్టోర్స్, వ్యాక్సిన్లు నిల్వ చేసే గది, లేబర్ రూమ్, వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవల గురించి పీహెచ్ సీ వైద్యాధికారి సాయి ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ వైద్య పరీక్షల వివరాలు అడిగారు. నూరు శాతం మందికి వైద్య పరీక్షలు పూర్తిచేయాలని అన్నారు. స్క్రీనింగ్ పూర్తయి ఆరు నెలలు గడిచిన మహిళలకు మరో దఫా వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతినెలా ఉచిత మందులు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు ఉంటాయని విషయాన్ని వారికి తెలియజేయాలని అన్నారు. ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వారి వెంట డీఎంహెచ్ఓ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, వైద్యులు సాయి ప్రసాద్, వెంకటేష్,తహసీల్దార్ విజయ్ తదితరులు ఉన్నారు.

## అర్ధరాత్రి పోస్టుమార్టం... తెల్లారేసరికి అంత్యక్రియలు పూర్తి

**నిజామాబాద్** : నిజామాబాద్లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు రియాజ్ సోమవారం జరిగిన ఎన్కౌంటర్లో మరణించిన సంగతి తెలిసిందే. అతడి అంత్యక్రియలు ఈ రోజు తెలవరాక ముందే పూర్తయ్యాయి. అర్ధరాత్రి 2 గంటల సమయంలో జిజిహెచ్ ఆసుపత్రి మార్చురీలో రియాజ్ మృత దేహానికి పోస్టుమార్టం జరిగింది. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మూడు గంటల ప్రాంతంలో బందోబస్తు నడుమ రియాజ్ మృతదేహం ఆసుపత్రి నుండి తరలించారు. అనంతరం మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున రియాజ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.కాగా బైకులు,బుల్లెట్ వాహనాలను దొంగిలించడంలో రియాజ్ సిద్ధహస్తుడు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసులు. గత మూడేళ్లలో దాదాపు 40 కేసులు నమోదైనాయి. దొంగిలించిన వాహనాలకు ఇంజిన్ నంబర్లు మార్చి, మహారాష్ట్రలో వాహనాలు అమ్మి సొమ్ము చేసుకునే వాడు. మూడుసార్లు జైలుకు వెళ్లి బెయిలుపై తిరిగొచ్చిన రియాజ్ నేర చరిత్రను కొనసాగించాడు. ఈ క్రమంలో ఓ దొంగతనం కేసులో రియాజ్ను అక్టోబర్ 17న పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. స్టేషన్కు తరలిస్తుండగా కానిస్టేబుల్ ప్రమోద్పై కత్తితో దాడిచేసి పరారయ్యాడు. ఈ దాడిలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి మరణించాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర పోలీస్ విభాగం పరారీలో ఉన్న నిందితుడిని 2 రోజుల్లోనే జల్లెడ పట్టి పట్టుకున్నారు. అయితే అరెస్టు సమయంలో రియాజ్కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతడిని జీజీహెచ్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆస్పత్రి నుంచి తప్పించుకునేందుకు రియాజ్ ప్రయత్నించారు. పోలీసు సిబ్బందిపై దాడి చేసి వారి వద్ద ఆయుధాలు లాక్కునేందుకు యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పులు జరపగా.. రియాజ్ బుల్లెట్ గాయాలకు మృతి చెందాడు. అనంతరం జీజీహెచ్ దవాఖాన మార్చురీలో సోమవారం అర్ధరాత్రి రియాజ్ మృతదేహానికి పోస్ట్మార్టం పూర్తయ్యింది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు బోధన్ రోడ్డులోని స్మశాన వాటికలో తెల్లవారక ముందే మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు.

## కూరగాయల దోపిడీని అరికట్టండి

**పాట కొట్టు పేరు తో ప్రజలను దోసుకు తింటున్న వ్యాపారులు**

**వ్యాపారుల సిండికేట్ దోపిడిపైచర్యలు తీసుకోవాలి**

**సామాన్య ప్రజానీకానికి అందు బాటులో ఉండే విధంగా ధరలను చర్యలు చేపట్టాలి**

**తాహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి**

**భద్రాద్రి కొత్తగూడెం** : మణుగూరు మున్సి పాలిటీ పరిధి లోని కూరగాయ దుకాణాల వ్యాపారులు అధిక ధరల తో ప్రజలను జలగల దోసుకుంటున్నారని, సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కూరగాయ దుకాణాలలో వ్యాపారుల దోపిడీని అరికట్టాలని తాహసిల్దార్ అద్దంకి. నరేష్, మున్సిపల్ కమిష నర్ ప్రసాదు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. మండలంలో కొందరు దుకాణదారులు, కూరగాయల వ్యాపారస్తులు పాట కొట్టు పేరుతో అధికరేట్లకు కూరగాయలను వికరిస్తున్నారని, ప్రజలను అడ్డంగా దోచుకొని ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో దుకాణ దారులు ఇష్ట రాజ్యాంగ అధిక రేట్లతో సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. పండుగ సందర్భాలలో కూరగాయల మార్కెట్ లో అధిక ధరలతో ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచుతూ, ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తున్నారని, సంబంధిత అధికారులు ఈ దోపిడిని అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. తక్షణ మే అధికారులు వ్యాపారస్తుల ఆర్థిక దోపిడీని నిలవరించాలని, ధరల నియంత్రణ చట్టం అమలు పరచాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా ధరలను ఉంచాలని, డిమాండ్ చేశారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేసే వి ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అవార్డుకు ఎంపికైన.. డాక్టర్ దేవి లక్ష్మి నరసయ్య....

**కమాన్ పూర్** : ఉమ్మడి కమాన్ పూర్ మండలం రానాపూర్ కు చెందిన దేవీ లక్ష్మీ నరసయ్య భారతీయ స్ఫూర్తి అవార్డుకు ఎంపికయ్యారు. దాదాపు 60కి పైగా స్వచ్ఛంద సేవఅవార్డులు అందుకున్న డాక్టర్ దేవి లక్ష్మీ నరసయ్య అవార్డుల అమ్ముల పొదిలో మరొక ఉత్తమమైన. భారతీయ స్పూర్తి సేవా రత్న అవార్డు×ప్రజాసేవ కోసం అంకితమై తెలంగాణ ఉద్యమంలో తను దేవుడిచ్చిన వరం లా భావించేపోలీసు ఉద్యోగాన్ని వదులుకొని. తెలంగాణ వచ్చేవరకు పోరాటం చేసి. నిరంతర ప్రజాసేవలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవి లక్ష్మీ నరసయ్య తెలంగాణ స్వేచ్ఛ. తెలంగాణఫ్రీడమ్ ఫైటర్గా గుర్తించి మరియువివిధ రంగాలలో ప్రతిభ కనబరుస్తూ.. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి ప్రతి ఏటా హైదరాబాదులో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ద్వారా ఎంపిక చేసి ఇవ్వడం జరుగుతుంది... అందులో భాగంగా నవంబర్ 5వ తేదీన డాక్టర్ దేవి లక్ష్మీనరసయ్య కు హైదరాబాదులోజరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందజేయనున్నారు.. గత 30 సంవత్సరాలుగా విద్యార్థులకు. మోటివేషన్ క్లాసులు. తన పోలీసు ఉద్యోగం నుంచి వచ్చే జీతం నుంచి ఫ్యాన్లు.. కుర్చీలు.. పుస్తకాలు.. బల్లలు... విద్యా వాలంటీర్లు నియమించడం..యువకులకు స్పోర్ట్స్ డ్రెస్సులు షూలు. ఉచిత శిక్షణ శిబిరాలు.

# పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

**పోలీస్ కమిషనర్ యస్. యం. విజయ్ కుమార్**




**సిద్దిపేట** : పోలీస్ కమిషనర్ యస్. యం. విజయ్ కుమార్, అడిషనల్ డీసీపీలు అడ్మిన్ సిహెచ్ కుషాల్కర్, ఏఆర్ అడిషన ల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, జిల్లా పోలీసు అధికారులు, మరియు అమరుల పోలీస్ కుటుంబ సభ్యులతో మరియు అధికారులు సిబ్బంది కలిసి పోలీస్ అమర వీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలు వేసి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆర్ఎస్ఐ సాయిప్రసాద్ స్మృతి పెరేడ్ గౌరవ వందనం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లాలో గతంలో విధి నిర్వహణలో అమరులైన యాదగిరి సిఐ, రామవరం హుస్నాబాద్ జాన్ విల్సన్, యస్ఐ రామవరం, హుస్నాబాద్, రాజగోపాలచారి, యస్ఐ దౌల్తాబాద్, చంద్రయ్య, హెచ్.సి. 156, దౌల్తాబాద్, రాంమూర్తి, పిసి 2173, కొండాపూర్ మద్దూర్, ప్రకాష్ సింగ్, పిసి, 956, సింగరాయికొండ, కోహెడ పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తరఫున ఎప్పుడు అండగా నిలుస్తామని తెలుపుచున్నాను. 21 అక్టోబర్ 1959 లో యస్ఐ కరింసింగ్ మరియు 20 మంది జవాన్లు కలసి లడక్ ప్రాంతంలో హాట్ స్రింగ్ విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ వారి పై దాడి చేసి 10 మందిని హతమార్చినారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్-21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినవోత్సవముగా ఫ్లాగ్ డే, జరుపుకోవడం ఆ పవిత్ర స్థలం నుండి ప్రారంభమైనది. పోలీసులు విపత్కర, క్లిష్ట పరిస్థితులలో వారి ఆరోగ్యాన్ని సహితం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడానికి శాంతిభద్రతలు చాలా ముఖ్యం అందుకు పోలీసు పాత్ర సమాజానికి ముఖ్యమని తెలుపుచున్నాను, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ గురించి నిరంతరం కృషి చేస్తున్న పోలీసులను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకునే అవసరం ఎంతైనావుంది. భారతదేశ రక్షణ, ప్రజాస్వామ్య విలువలు కాపాడడంలో ఎనలేని కృషి చేస్తున్న పోలీసులకు నా ప్రత్యేక అభినందనలు. పోలీసులు త్యాగాలకు సైతం భయపడకుండా కార్యసాధనలో వెనుకడుగు వేయకుండా రెట్టించిన సమరోత్సాహంతో అసాంఘిక శక్తులతో పోరాడి విజయాన్ని పొందాలని ఆశిస్తున్నాను. ఈ సంవత్సరంలో మన దేశంలో విధినిర్వహణలో 191, మంది వీరమరణం పొందినారు. వీరమరణం పొందిన వారందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలుపుచున్నాను. వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమాన్ని మరియు వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను అందజేయడం మరియు కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు అందించే నిజమైన నివాళి. పోలీస్ అమరవీరుల దినోత్సవాల సందర్భంగా త్యాగాలను సమాజం గుర్తుంచుకొనే విధంగా ప్రముఖ దిన పత్రికలలో ప్రకటనలు, బ్యానర్లు మరియు కమిషనరేట్ నందు, పోలీసు స్టేషన్ లలో ఓపెన్ హౌజ్ కార్యక్రమము, వ్యాసరచన పోటీలు, రక్త దాన శిబిరాలు, కొవ్వొత్తి ర్యాలీలు, సైకిల్ ర్యాలీలు, తదితర కార్యక్రమాలు ఈ నెల 31 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుంది. మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుంది. షీటీమ్, భరోసా, సఖి, సెంటర్ల ద్వారా మహిళలకు, చిన్నారులకు ఎన్నో రకాల సేవలు పోలీస్ శాఖ ద్వారా అందించబడుతున్నాయి. మరియు పోలీస్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్, కమ్యూనిటీ, పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువై ఎన్నో సామాజిక, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తున్నందుకు సిబ్బందికి అభినందనలు. అమరులైన పోలీస్ త్యాగఫలంగా పోలీసులు ఏ మారుమూల ప్రాంతానికైనా స్వచ్ఛందంగా వెళ్లి ప్రజా సమస్యలను తీర్చడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం లడక్ ప్రాంతంలో విధినిర్వహణలో ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పించడం జరుగుతుంది. దేశ సరిహద్దుల్లో నలుమూలల మిల్ట్రీ, పోలీస్ అనునిత్యం విధులు నిర్వహించడం జరుగుతుంది. భారతదేశ అభివృద్ధిలో శాంతిభద్రతలు ఎంత ఉన్నతంగా ఉంటే అభివృద్ధిఅంత త్వరగా జరుగుతుందన్నారు. రిపబ్లిక్ డే భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత పరిపాలన పోలీస్ శాఖ విధులు తదనుగుణంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు రక్షణగా నిలుస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తుంది పోలీస్ శాఖ, ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది పారదర్శకంగా నిబద్ధతతో నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రజా కేంద్రంగా పోలీసు వ్యవస్థ విధులు నిర్వహించాలని తెలిపారు. భారతదేశ అభివృద్ధి వ్యాపార సంస్థలలో పోలీసుల పాత్ర అనునిత్యం అవసరము ఉంటుందని తెలిపారు. పోలీస్ కమిషనర్ పోలీస్ అమరవీరుల కుటుంబాలను కలుసుకొని వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. ఈ సందర్భంగా అమరుడైన ప్రకాష్ సింగ్ భార్య కౌసల్య తన భర్తను గుర్తుచేసుకొని కన్నీరు పెట్టారు బాధపడవద్దని అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ ఓదార్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమానికి విచ్చేసిన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు, జిల్లా పోలీసు అధికారులకు సిబ్బందికి, రిటైర్డ్ పోలీస్ అధికారులకు సిబ్బందికి మీడియా మిత్రులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో విధినిర్వహణలో మరణించి అమరులైన 191 మంది అధికారుల సిబ్బంది పేర్లు అడిషనల్ డీసీపీలు అడ్మిన్ సిహెచ్ కుషాల్కర్,చదివి వినిపించారు. ఫ్లాగ్ డే కార్యక్రమంలో ఏసీపీలు నరసింహులు, రవీందర్ రెడ్డి, సుమన్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, మొగిలి, శ్రీధర్ గౌడ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విష్ణు ప్రసాద్, ధరణి కుమార్, రాజేష్, కార్తీక్, ఇన్స్పెక్టర్లు సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, ప్రవీణ్ కుమార్, శ్రీను, శ్రీనివాస్, లతీఫ్, రామకృష్ణ, మల్లేశం గౌడ్, జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారులు, రాజులు, వీరారెడ్డి మరియు తదితరులు పోలీస్ అధికారులు సిబ్బంది, సిపి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొని అమరవీరుల స్థూపం పై పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



# దీపావళి వేళ క్యూట్ ఫోటోలు వైరల్

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ సమంత గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అక్కినేని నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత సమంత బ్రాండ్ మరింత పెరిగింది.మొదట్లో అనారోగ్యంతో బాధపడిన సమంత, ఆ తర్వాత ఆ క్రమక్రమంగా కోలుకుంది. అదే సమయంలో తన కెరీర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి సక్సెస్ అవుతోంది సమంత. హీరోయిన్ గానే కాకుండా నిర్మాతగా కూడా ప్రస్తుతం హీరోయిన్ సమంత దూసుకు వెళ్తున్నారు. అటు వ్యాపారాలు కూడా లాభాల్లో దూసుకు వెళ్తున్నాయి. చేతినిండా సంపాదిస్తున్న సమంత తాజాగా దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఇటీవల హీరోయిన్ సమంత కొత్త ఇంటిని కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తన కొత్త ఇంట్లోనే తాజాగా దీపావళి చేసుకున్నారట సమంత. అయితే ఈ వేడుకల్లో రాజ్ నిడిమోరు కూడా పాల్గొన్నారు. దీంతో సమంత దీపావళి వేడుకల ఫోటోలు సోషల్ మీడియాను దున్నేస్తున్నాయి. రాజ్ నిడిమోరుతో హీరోయిన్ సమంత రిలేషన్ పెట్టుకుందని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అతన్నే హీరోయిన్ సమంత త్వరలో రెండో పెళ్లి చేసుకోబోతున్నట్లు కూడా వార్తలు వైరల్ చేశారు. అయితే దీనిపై ఇప్పటి వరకు ఈ ఇద్దరు ఎక్కడా కూడా స్పందించలేదు. కానీ సమంత ఎక్కడ ఉంటే అక్కడే రాజ్ నిడిమోరు కనిపిస్తున్న నేపథ్యంలో రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఇక లేటేస్ట్ గా దీపావళి వేడుకలు కూడా సమంతతో రాజ్ నిడిమోరు చేసుకున్నాడు.

# తరుణ భాస్కర్‌తో ఈషా రెబ్బ దీపావళి వేడుకలు



తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ గురించి తెలియని వారు ఉండరు. 2012 సంవత్సరంలో లైఫ్ ఈజ్ బ్యూటీ ఫుల్ సినిమాతో మెరిసిన ఈ అందాల తార పలు సినిమాల్లో హీరోయిన్ గా కూడా ఛాన్స్ కొట్టేసింది.పెద్ద హీరోయిన్ గా పేరు సక్సెస్ కాలేకపోతున్న ఈశా రెబ్బ, చిన్న పాత్రలు వచ్చినా చేస్తోంది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, అరవింద సమేత వీర రాఘవ లాంటి సినిమాలలో సైడ్ హీరోయిన్ పాత్రలు చేసి మెప్పించింది. అయితే అలాంటి ఈషా రెబ్బ ఈ మధ్యకాలంలో పిట్టకథలు, 3రోజెస్ లాంటి వెబ్ సిరీస్ లో కూడా నటించింది. ఇది ఇలా ఉండగా తాజాగా ఈషా రెబ్బ గురించి ఓ సంచలన విషయం బయటకు వచ్చింది. దీపావళి సందర్భంగా దర్శకుడు తరుణ్ భాస్కర్ తో ఈషా రెబ్బ మెరిశారు. దీపావళి టపాకాయలు పేల్చుతూ సందడి చేశారు. విశ్వక్ సేన్ ఇంట్లో ఈ దీపావళి వేడుకలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో విశ్వక్ సేన్ ఇంటికి తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ కలిసి వెళ్లారు. దీంతో వీళ్లిద్దరూ క్లోజ్ గా కనిపించిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ నేపథ్యంలోనే తరుణ్, ఈషా రెబ్బ మధ్య రిలేషన్ ఉందని సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని మరికొందరు అంటున్నారు. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో ఈషా రెబ్బ త్వరలో కొత్త సినిమా చేయబోతున్నారని, అందుకే అతనితో వెళ్ళినట్లు చెబుతున్నారు.

# బ్రేకప్‌పై రష్మిక రియాక్షన్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందాన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కన్నడ నుంచి తెలుగులో అడుగుపెట్టిన ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా ఎదిగారు.ముఖ్యంగా పుష్ప, యానిమల్ సినిమాలు చేసిన తర్వాత రష్మిక స్టార్ డం మొత్తం మారిపోయింది. ఇప్పుడు బాలీవుడ్ లోనే వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అందాల తార రష్మిక. ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా ( %ఱష్ట్రవ +అతీశ్రీటతీఱవఅ%) ప్రమోషన్స్ లో హీరోయిన్ రష్మిక కూడా పాల్గొంటున్నారు. ఈ సినిమా నవంబర్ 7వ తేదీన రిలీజ్ కానుంది. రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రష్మికకు జోడిగా దీక్షిత్ శెట్టి మెరుస్తున్నారు. అయితే ఈ సినిమా గురించి పలు విషయాలు పంచుకున్న రష్మిక.. రిలేషన్ షిప్ బ్రేకప్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రేమలో బ్రేకప్ అయితే, అబ్బాయిల కంటే ఎక్కువగా అమ్మాయిలు బాధపడతారని ఆమె పేర్కొన్నారు. ఇది తన పర్సనల్ అభిప్రాయం అంటూ ఎమోషనల్ అయ్యారు. బ్రేకప్ విషయంలో అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలు బాధపడతారని ప్రచారం చేస్తున్నారు.. కానీ అందులో చాలా తప్పు ఉందని ఆమె పేర్కొన్నారు. ఆ విషయాన్ని ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బాధను వ్యక్తపరిచేందుకు తాము గడ్డం పెంచలేము అని, మందు తాగలేమని ఆమె సెటైర్లు కూడా పేల్చారు. లోలోపల అమ్మాయిలకే బాధ ఎక్కువగా ఉంటుందన్నారు. కానీ ఆ బాధ బయటకు చూపించబోరని తెలిపారు. లవ్ ఫెల్యూర్ అయితే, గుండె పగిలిపోతుందంటూ పేర్కొన్నారు. దీంతో రష్మిక చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. కాగా విజయ్ దేవరకొండ, రష్మిక ఇద్దరు ఎంగేజ్మెంట్ చేసుకున్నట్లు మొన్న దసరా నుంచి వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

# థ్రిల్ చేసే 'ది బ్లాక్ గోల్డ్'



కథానాయిక సంయుక్త తొలిసారి ఓ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్‌లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి విజయ వంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్‌తో కలిసి చేస్తున్న ఆరవ సినిమా ఇది. సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. ఆదివారం మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'ది బ్లాక్ గోల్డ్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ నేడు (సోమవారం) విడుదల కానుంది. దర్శకుడు యోగేష్ కెఎంసి థ్రిల్లర్ జానర్‌కి కొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ప్రేక్షకులకు థ్రిల్ చేయబోతున్నారు. సంయుక్త డైనమిక్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆమె అద్భుతమైన స్టంట్స్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి డీవోపీ: ఎ.వసంత్, సంగీతం: సామ్ సిఎస్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, కథ– డైలాగ్స్: యోగేష్, ప్రసాద్ నాయుడు, స్క్రిప్ట్ కో–ఆర్డినేటర్: మధు విప్పర్తి, యాక్షన్: రామకృష్ణ, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి.

# జాక్ టైంలో ఇది జరిగింది!



చిన్న చిన్న పాత్రలతో మొదలుపెట్టి.. ఆ తర్వాత హీరోగా మారి.. స్టార్ ఇమేజ్ సంపాదంచిన నటుడు సిద్ధు కరోనా టైంలో ఓటీటీలో రిలీజైన కృష్ణ అండ్ హిజ్ లీల అతడికి ఫస్ట్ బ్రేక్ ఇవ్వగా.. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలు బ్లాక్‌బస్టర్లయి తన రేంజ్ పెంచాయి. కానీ టిల్లు స్క్వేర్ తర్వాత వచ్చిన జాక్ మాత్రం పెద్ద డిజాస్టర్ అయి సిద్ధును తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆ సినిమా మిగిల్చిన నష్టాల గురించి ఇండస్ట్రీలో పెద్ద చర్చే జరిగింది. టిల్లు స్క్వేర్ వసూళ్లలో పదో వంతు కూడా ఈ సినిమాకు రాకపోవడం.. భారీ బడ్జెట్ సినిమాలను మించి దీనికి నష్టాలు రావడం గురించి చాలా రోజులు ఇండస్ట్రీలో మాట్లాడుకున్నారు. సిద్ధును పరోక్షంగా టార్గెట్ చేస్తూ ఒక నిర్మాత ప్రెస్ మీట్లో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. దీని గురించి తాజాగా కొందరు జర్నలిస్టులతో కలిసి పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో సిద్ధు స్పందించాడు. జాక్ సినిమా విషయంలో తనను కావాలనే టార్గెట్ చేశారని సిద్ధు అభిప్రాయపడ్డాడు. పనిగట్టుకుని తనను సెంటర్ చేసి నిందించే ప్రయత్నం జరిగిందని అతనన్నాడు. ఆ సమయంలో తాను బాధ పడ్డట్లు అతను చెప్పాడు. జాక్ సినిమా ఫెయిలయ్యాక తనను నిర్మాతలేమీ డబ్బులు అడగలేదని.. కానీ తనే ముందుకొచ్చి పారితోషకంలో కొంత భాగాన్ని (దాదాపు నాలుగన్నర కోట్లని వార్తలు వచ్చాయి) వెనక్కిచ్చినట్లు అతను వెల్లడించాడు. తాను ప్రశాంతంగా పడుకోవాలంటే ఆ డబ్బులు వెనక్కి ఇవ్వాలి అనిపించి ఇచ్చినట్లు అతను చెప్పాడు. ఎవరైనా స్టేజ్ మీద, ఇంటర్వ్యూల్లో కాన్ఫిడెంట్‌గా మాట్లాడితే జనం తట్టుకోలేరని.. ఇలా చేస్తే యారొగెన్స్ అంటారని.. ఎప్పుడూ చేతులు కట్టుకుని, వినమ్రంగా ఉండాలని కోరుకుంటారని అతనన్నాడు. తాను స్క్రిప్ట రాయగలనని చెప్పినా అది కూడా యారొగెన్స్ లాగా చూస్తారని సిద్ధు ఆశ్చర్యపోయాడు. తాను రాసిన స్క్రిప్ట సక్సెస్ అవుతుందా లేదా అన్నది వేరే విషయమని.. కానీ ఒక సీన్ రాయడం, దాన్ని తెరపై ప్రెజెంట్ చేయడం తనకు తెలుసని అతనన్నాడు. కానీ ఇలాంటివి చెబితే చాలామంది తట్టుకోలేరని సిద్ధు వ్యాఖ్యానించాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.